ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 20 ఏప్రిల్ 2024

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 43.0 28.0

కణేకల్లు ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు



జగన్ అంటే విధ్వంసం..!

నా పేరు చెబితే అభివృద్ధి గుర్తుకొస్తుంది

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి
మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది
కణేకల్లు సభలో టీడీపీ అధినేత చంద్రబాబు
ప్రజాగళం సభకు పోటెత్తిన రాయదుర్గం ప్రజ







అఖండ మెజార్టీతో గెలిపించండి..

రాయదుర్గం/కణేకల్లు, ఏప్రిల్ 19: 'జగన్ పేరు చెబితే విధ్వంసం గుర్తుకొస్తుంది. నా పేరు చెబితే నేను చేసిన అభివృద్ధి అడుగడుగునా కనిపిస్తుంది. నేను ఏం చేశానో చెప్పేందుకు సిద్ధం. ఈ ఐదేళ్లలో నువ్వేం చేశావో చర్చకు సిద్ధమా జగన్..?' అని టీడీపీ అధినేత చంద్రబాబు సవాలు విసిరారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని, అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని ప్రజలను కోరారు. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లులో శుక్రవారం రాత్రి జరిగిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసాన్ని ఎండగట్టారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని, తెచ్చిన పరిశ్రమలు, కల్పించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. భారీగా తరలివచ్చిన జనం మధ్య సాగిన ఈ సమావేశం టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. సభ ఆద్యంతం కేరింతలు, చప్పట్లతో ఆయనకతి మద్దతు పలికారు. కణేకల్లుక్రాస్‌లో హెలీప్యాడ్ వద్దకు చేరుకోగానే నాయకులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆరు కిలోమీటర్లు చంద్రబాబు వాహనంలో ప్రయాణించారు. కణేకల్లు నేసేపేట రోడ్డు వద్ద నుంచి చిక్కణ్ణేశ్వర స్వామి సర్కిల్ వరకూ రోడ్‌షో నిర్వహించారు. చంద్రబాబుకు అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన జనానికి చంద్రబాబు అభివాదం చేస్తూ, విజయ సంకేతం చూపుతూ గంట పాటు ప్రసంగించారు. రాయలసీమలో సాగునీటి సమస్య, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారు. ఒక్క చాన్స్ పేరిట ఓట్లు తెచ్చుకున్న జగన్.. అదే చివరి చాన్స్ అనే స్థాయికి దిగజారారని విమర్శించారు. పాఠశాల భవనాలకు రంగులు వేస్తే చదువు రాదని అన్నారు.

సాగునీటికి హామీ







తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ, బీటీపీ పనులు, ఉంతకల్లు రిజర్వాయర్ పనులు కుంటుపడిన విషయాలను చంద్రబాబు ఎత్తి చూపారు. అధికారంలోకి రాగానే వాటిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టెక్నాలజీ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ.. సెల్‌ఫోన్ లైట్లను ఆన్ చేయించి సంఘీభావం తెలపాలని కోరారు. దీంతో అందరూ సెల్‌ఫోన్‌లో టార్చ్ ఆన్‌చేసి మద్దతు తెలిపారు. పెట్రోల్, డీజిల్, విద్యుత్, నిత్యావసర ధరల పెరుగుదల గురించి చెబుతూ.. తెలుగుదేశం ప్రభుత్వంతో పోల్చారు. అన్న క్యాంటీన్‌ను గుర్తు చేశారు. రంజాన్‌తోఫా, దుల్హాన్ పథకాలతో పాటు మైనార్టీల సంక్షేమం తమతోనే అని ఆ వర్గాలకు గుర్తు చేశారు. అమ్మ ఒడి పథకాన్ని నాన్న బుడ్డీతో దోపిడీ చేస్తున్నారని విరుచుకుపడ్డారు. విధ్వంసకర పాలన సాగిస్తున్న జగన్‌ను రక్తం తాగే జలగగా అభివర్ణించారు. ఏప్రిల్ నుంచే రూ.4 వేలు పింఛన్ ఇస్తామని, ఇంటి వద్దకే తెచ్చిస్తామని అన్నారు. ఎన్డీఏతో కలవాల్సిన అవసరాన్ని మైనార్టీలకు వివరించారు. అధికార రంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, మెగా డీఎస్సీపై తొలి సంతకం పెడతామని అన్నారు. కరువు జిల్లా అనంతపై ప్రత్యేకమైన ప్రేమ ఉందని స్పష్టం చేశారు. వలంటీర్ల గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని అన్నారు. తెలుగుదేశం పార్టీకి బీసీలే అండ అని అన్నారు. నియోజకవర్గంలో చేయాల్సిన అభివృద్ధి పనులకు ఆయన గట్టి హామీ ఇచ్చారు. తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని కోరారు.

'వైసీపీ ఐదేళ్ల పాలనలో మీ పొలాలకు నీళ్లు వచ్చాయా..? మీ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయా..? మీ బిడ్డల భవిష్యత్తు కనిపిస్తోందా..? గ్రామీణ ప్రాంతాలో రోడ్లు బాగుపడ్డాయా..?'

'తండ్రిలేని బిడ్డ అన్నాడు. ఒక్క చాన్స్ అన్నాడు. ముద్దులు పెట్టాడు. తల నిమిరాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత పిడిగుద్దులు గుద్దాడు'

'ఐదేళ్ల జలగన్న పాలనలో ఒక్కో కుటుంబంపై రూ.10 లక్షల అప్పు తెచ్చారు. జనం పేరుతో రూ.13 లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చారు. ఆ అప్పు జగన్ కడతాడా..? సాక్షి పేపర్ కడుతుందా?'

'అధికారంలోకి రాగానే సంపద సృష్టిస్తాం... ఆదాయాన్ని పెంచుతాం.. ప్రజలకు పంచుతాం... రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ఎన్డీయే కూటమిదే'

- కణేకల్లు ప్రజాగళం సభలో చంద్రబాబు

సమస్యలన్నీ పరిష్కరిస్తా..



గుమ్మఘట్ట మండలం గోనబావిలో బీసీ బాలికల పాఠశాలకు తన హయాంలో రూ.24 కోట్లు మంజూరు చేశానని, వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పనులను ఆపేసిందని చంద్రబాబు అన్నారు. రాయదుర్గంలో బాలికల జూనియర్ కళాశాలకోసం రూ.52 లక్షలు ఇచ్చామని, వైసీపీ ప్రభుత్వం దాన్ని కూడా మధ్యలోనే ఆపేసిందని విమర్శించారు. కణేకల్లు మండలం మాల్యం బ్రాంచ్ కెనాల్‌కు 36వ ప్యాకేజీ కింద రూ.266 కోట్లు విడుదల చేశామని, జగన్ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదని అన్నారు. తద్వారా 27వేల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందని అన్నారు. ఆగిపోయిన పనులన్నింటినీ అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం మండలం ఆవులదట్లలో 34వ ప్యాకేజీ కింద హంద్రీనీవా పనులను కూడా పునఃప్రారంభిస్తామని అన్నారు. కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని, శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు కింద రెండు పంటలకు నీరు అందిస్తామని అన్నారు. వేదవతి హగరి నదిలో నాలుగుచోట్ల సబ్ సర్‌ప్లస్ ట్యాంకులు నిర్మిస్తామని అన్నారు. మధ్యలో నిలబడిపోయిన బీటీపీ ప్రాజెక్టు పనులను, హెచ్చెల్సీ పనులను, ఉంతకల్లు రిజర్వాయర్ పనులను కూడా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

రెండో రోజు 29 నామినేషన్లు

ఎంపీ స్థానానికి ఒకటి.. ఎమ్మెల్యేలకు 28..



ఉరవకొండలో నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్ రెడ్డి



కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న ఆయన సోదరి రాధామాధవి

అనంతపురం టౌన్/పుట్టపర్తి, ఏప్రిల్ 19: ఉమ్మడి జిల్లాలో రెండో రోజు మొత్తం 29 నామినేషన్లు దాఖలయ్యాయి. అనంతపురం ఎంపీ స్థానానికి తాడిపత్రికి చెందిన పామిశెట్టి చౌడేశ్వరి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 14 అసెంబ్లీ స్థానాల పరిధిలో 28 నామినేషన్లు దాఖలయ్యాయి. రాప్తాడులో 5, మడకశిర, ధర్మవరం, రాయదుర్గం, గుంతకల్లు, అనంతపురం అర్బన్, ఉరవకొండలో ఒక్కొక్కటి, శింగనమల, కళ్యాణదుర్గం, తాడిపత్రి, పెనుకొండ, హిందూపురంలో రెండేసి నామినేషన్లు దాఖలయ్యాయి. కదిరిలో మూడు, పుట్టపర్తిలో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

- శింగనమలలో తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా న్యాయవాది యాట వెంకట సుబ్బన్న, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా కప్పల నాగరాజు నామినేషన్ వేశారు. గుంతకల్లులో వైసీపీ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే వై.వెంకట రామిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. రాయదుర్గంలో బీఎస్పీ తరఫున చిందనూరు నాగరాజు నామినేషన్ వేశారు. కళ్యాణదుర్గంలో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తరఫున ఆయన సోదరి రాధామాధవి నామినేషన్ దాఖలు చేశారు. ఉరవకొండలో కాంగ్రెస్ తరఫున మధుసూదన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తాడిపత్రిలో టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

రేపు బ్రాగ్‌సెట్ ఫేజ్-2 పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్19: ఇంటర్‌మీడియట్ బ్రాగ్ సెట్(బీఆర్ అంబేడ్కర్ గురుకులం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)-2024 ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఫేజ్-2 పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే అభ్యర్థుల మొబైల్ ఫోన్‌లకు మెసేజ్, ఫోన్‌కాల్ ద్వారా సమాచారం అందించామ న్నారు. ఫేజ్-2 పరీక్షకు హాల్ టిక్కెట్‌తో పాటు ఐడెంటిటీ కార్డుతో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలన్నారు. ఉదయం 10 గంటలకు కురుగుంటలోని అంబేడ్కర్ గురుకులం పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. వివరాలకు జిల్లా అంబేడ్కర్ గురుకులం డీసీఓ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.


రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 19: జిల్లాలోని 15 మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాలకు 21న పరీక్షలు నిర్వహించ నున్నట్లు డీఈఓ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల హాల్ టిక్కెట్లు http://apms.apcfss.in/ stdentLogin.do వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్ విషయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు సహకరించాలని సూచించారు.


చిన్నారులకు సంస్కారం నేర్పండి

మైసూరు దత్తపీఠం ఉత్తరోత్తర పీఠాధిపతి దత్త విజయానందతీర్థ స్వామీజీ

పామిడి, ఏప్రిల్ 19: చిన్నారులకు భగవద్గీత పఠనంతో పాటు సంస్కారం నేర్పాలని మైసూరు దత్తపీఠం ఉత్తరోత్తర పీఠాధిపతి దత్త విజయానందతీర్థ స్వామి పేర్కొన్నారు. పట్టణంలోని అనఘా ఆత్రేయ దత్తపాదుకా క్షేత్రంను శుక్రవారం ఆయన సందర్శించారు. వరాంజనేయస్వామి, అనఘా ఆత్రేయ దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలన్నారు. ప్రతి రోజూ దేవాలయాన్ని సందర్శిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న విజయానందతీర్థ స్వామీజీ



పరీక్షల కోసం ప్రత్యేక బస్సులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19: నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నావెల్ అకాడమీ(ఎన్‌ఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్(సీడీఎస్) పరీక్షలు రాయనున్న అభ్యర్థుల కోసం ఈనెల 21న అనంతపురం రీజియన్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అనంతపురం బస్టాండు నుంచి పరీక్షా కేంద్రాలైన జేఎన్‌టీయూ, కేఎస్‌ఎన్ కాలేజీలకు పరీక్ష సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడుపుతామన్నారు.

అనంతపురం
శ్రీ సత్యసాయి
శనివారం 20 ఏప్రిల్ 2024

జన కేతనం



ఆంధ్రజ్యోతి



నియోజకవర్గ చరిత్ర

- గుంతకల్లు నియోజకవర్గం అన్నింటా వెనుకబాటు
- 2009 నుంచి నియోజకవర్గ హోదా కోల్పోయిన గుత్తి
- ఆసియాలో అతిపెద్ద మిల్లు.. గుంతకల్లులో ఏసీఎస్ మూత
- పామిడి గార్మెంట్ పరిశ్రమకు చేయూత కరువు
- తాగునీరు.. నియోజకవర్గ ప్రజల అతిపెద్ద సమస్య
- స్వతంత్ర అభ్యర్థికి పట్టం.. తొలి ఎమ్మెల్యే రాజారాం



ఒకప్పుడు పరిశ్రమలతో కళకళలాడిన గుంతకల్లు నేడు ఉపాధి లేక వెలవెలబోతోంది. ఏసీఎస్ మిల్లు, సిమెంటు స్లీపర్ల తయారీ, సినిమా కటౌట్ల తయారీ, సినిమా పంపిణీ పరిశ్రమలతో కళకళలాడేది. ప్రతిసారి ఎన్నికల్లో ఏసీఎస్ మిల్లును తెరిపిస్తామని నేతలు హామీలు ఇవ్వడమే కానీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. హంద్రీనీవా కాలువ గుంతకల్లు నుంచే జిల్లాలోకి ప్రవేశిస్తున్నా, ఈనియోజకవర్గానికి ఆయకట్టును కేటాయించలేదు.

గతమే ఘనం..

గుంతకల్లు

గుంతకల్లు నియోజకవర్గం 2009కు ముందు గుత్తి పేరిట ఉండేది. గుత్తి నియోజకవర్గం 1952లో ఏర్పాటయింది. తొలి ఎన్నికలు 1955లో జరిగాయి. గుత్తి నియోజకవర్గం ఏర్పాటైనప్పుడు గుంతకల్లు రైల్వే డివిజనల్ కేంద్రంగా లేదు. గుంతకల్లు కంటే గుత్తి పెద్ద పట్టణంగా, తాలూకా కేంద్రంగా ఉండేది. అందువల్ల 1952లో గుత్తి కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. 1955లో గుంతకల్లులో రైల్వే డివిజన్ ఏర్పాటైన తర్వాత ఈ గ్రామం పట్టణంగా అభివృద్ధి చెందింది. దీంతో గుంతకల్లును నియోజకవర్గంగా గుర్తించాలంటూ వచ్చిన డిమాండ్ల మేరకు 2009లో పునర్విభజనలో భాగంగా గుత్తి నియోజకవర్గాన్ని గుంతకల్లు నియోజకవర్గంగా మార్పుచేశారు. అప్పటి నుంచి ఇప్పటికి మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో కాంగ్రెస్ నుంచి కొట్రికే మధుసూదన్, 2014లో టీడీపీ నుంచి ఆర్.జితేంద్రగౌడు, 2019లో వైసీపీ నుంచి వై. వెంకట రామిరెడ్డి గెలుపొందారు. గుత్తి నియోజకవర్గంలో సాయినాథ్‌గౌడుకు 1999లో టీడీపీ తరపున పోటీ చేసి 34,464 ఓట్ల అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. 1972లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన డి.వెంకట రెడ్డి అత్యల్ప ఓట్లతో గెలుపొందారు. గుంతకల్లు నియోజకవర్గం ఏర్పడ్డాక వై.వెంకట రామిరెడ్డి, వైసీపీ తరపున, 2019లో పోటీచేసి 48,532 ఓట్ల అత్యధిక మెజారిటీ సాధించారు. 2014లో టీడీపీ తరపున పోటీ చేసిన ఆర్.జితేంద్రగౌడు 5094 ఓట్ల అత్యల్ప మెజారిటీతో గెలిచారు. గుత్తి నియోజకవర్గంలో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ నాలుగుసార్లు విజయం సాధించింది. గుంతకల్లు నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ఒక్కోసారి గెలిచాయి.

నియోజకవర్గ కేంద్రం మార్పు

1952 నుంచి 2009 వరకూ ఈ నియోజకవర్గం గుత్తి కేంద్రంగా ఉండింది. 2009లో గుంతకల్లు నియోజకవర్గ కేంద్రంగా మారింది. గుత్తి చివరి ఎమ్మెల్యే ఎన్. నీలావతి, గుంతకల్లు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్.

తొలి ఎమ్మెల్యే రాజారాం

గుంతకల్లు నియోజకవర్గం తొలుత గుత్తి నియోజకవర్గంగా ఉండేది. తొలిసారి 1955లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎం.రాజారాం కాంగ్రెస్ పార్టీకి చెందిన సంద నారాయణప్పపై 534 ఓట్లతో గెలుపొందారు. రాజారాం ఎస్సీ (మాదిగ) సామాజికవర్గానికి చెందినవారు. ఉరవకొండ తాలూకా కొనకొండ్ల ఈయన స్వస్థలం. ఈయన గుంతకల్లుకు చేరుకుని బెంచికొట్టాల ప్రాంతంలో నివసిస్తూ ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేసేవారు. తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత ఈయన కుమారుడు చంద్రశేఖర్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేశారు. చైర్మన్ పదవికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత ఆయన కుటుంబంలో ఎవరూ రాజకీయంగా కొనసాగలేదు.

నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు

గుంతకల్లు పట్టణం గతంలో ఏసీఎస్ మిల్లు, సిమెంటు స్లీపర్ల తయారీ, సినిమా కటౌట్ల తయారీ, సినిమా పంపిణీ పరిశ్రమలతో కళకళలాడేది. ఉద్యోగిత ఎక్కువగా ఉన్న కారణంగా కొనుగోలు శక్తి అధికంగా ఉండేది. కానీ కాలానుగుణంగా పరిశ్రమలన్నీ మూతపడి ఉద్యోగాలు గల్లంతయ్యాయి. ఏసీఎస్ మిల్లును తెరిపిస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నా, దాన్ని ఇంత వరకూ తెరిపించలేకపోయారు. ఈ పరిశ్రమను తెరిస్తే స్థానికంగా నిరుద్యోగ సమస్య కొంత తగ్గుతుందని డిమాండు ఉంది. గుంతకల్లు పట్టణంలో రైల్వే స్టేషన్ ప్రాంతం నుంచి సరైన రహదారి లేనందున ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. హంద్రీనీవా కాలువ గుంతకల్లు నుంచే జిల్లాలోకి ప్రవేశిస్తున్నా, ఈ నియోజకవర్గానికి ఆయకట్టును కేటాయించలేదు. ఈ ప్రాజెక్టు కింద ఆయకట్టును స్థిరీకరించాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. గుంతకల్లులో టీడీపీ హయాంలో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు పూర్తయి కొన్ని, పూర్తి కాక కొన్ని నిలిచిపోయాయి. వాటిని తెరిపించడం, పూర్తిచేయాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. హంద్రీనీవాను వెడల్పుచేసే పనులను టీడీపీ చేపట్టి 50 పూర్తిచేసింది. వాటిని వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. రూ.8 వేల కోట్లతో టెండరును కూడా నిర్వహించి డబ్బు ఇవ్వకుండా, పనులను ప్రారంభించకుండా వదిలేసింది. గుత్తి, పామిడి మండలాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ రెండు పట్టణాలకు తాగునీరందిస్తామంటూ ఎన్నికల హామీలు ఇస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. గుత్తిలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. డ్రెయిన్ల నిర్మాణం అత్యవసరం. పామిడిలో కూడా రోడ్లు, డ్రెయిన్ల సమస్య తీవ్రంగా ఉంది. పామిడిలో టెక్స్‌టైల్ పార్కు మూతపడింది. దీనిని తెరిపిస్తామంటూ వైసీపీ ఎన్నికల సమయంలో డాంబికాలు పలికింది. కానీ పట్టించుకున్నది లేదు.

తలమానికం.. రైల్వే డివిజన్

గుంతకల్లులో రైల్వే డివిజనల్ హెడ్‌క్వార్టర్స్ ఉండటం ఇక్కడి ప్రత్యేకత. అలాగే దేశంలోనే జిల్లా కేంద్రం కానిచోట డివిజన్ హెడ్ క్వార్టర్స్ ఉండటం కూడా ఓ ప్రత్యేకత. ఇక్కడ నివసిస్తున్న రైల్వే ఉద్యోగులలో దాదాపు పది వేల ఓట్లు కలిగి ఉన్నారు..

నియోజకవర్గ ప్రత్యేకత

టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకూ (గుత్తి, గుంతకల్లు నియోజకవర్గాలు కలిపి) తొమ్మిదిసార్లు ఎన్నికలు జరిగాయి. అందులో ఐదుసార్లు టీడీపీ, మూడుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీ గెలుపొందాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిందో, ఆ పార్టీ అభ్యర్థే గుంతకల్లు/గుత్తి నియోజకవర్గంలో విజయం సాధించారు. ఇప్పటిదాకా టీడీపీలో జితేంద్రగౌడు తప్ప మరెవరూ వరుసగా రెండుసార్లు పార్టీ టిక్కెట్టును పొందలేదు. ఈయన 2014, 2019 సంవత్సరాల్లో వరుసగా టిక్కెట్టు సాధించారు. తొలిసారి గెలిచి, రెండోసారి ఓడిపోయారు. వెంకటరామిరెడ్డికి టిక్కెట్టు లభించడం ఇది మూడోసారి. ఇది నియోజకవర్గంలో ఏ పార్టీకైనా ఒక రికార్డు. మూడుసార్లు ఎవరూ ఒక పార్టీలో టిక్కెట్టు పొందలేకపోయారు. గాదిలింగప్ప గుత్తి నియోజకవర్గంలో 1985, 1994 సంవత్సరాల్లో, 1999లో కాంగ్రెస్ నుంచి టిక్కెట్టు సాధించారు.


ప్రస్తుత ఓటర్ల సంఖ్య

మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
గుంతకల్లు	72,995	76,330	57	1,49,382
గుత్తి	34,638	35,552	13	70,203
పామిడి	23,671	23,774	6	47,451
2024 సం. ఓటర్లు	1,31,304	1,35,656	76	2,67,036
2019 సం. ఓటర్లు	1,17,458	1,14,579	72	2,32,167

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ ఓట్లు
1955	రాజారాం	ఇండిపెండెంట్	సంద నారాయణప్ప	కాంగ్రెస్	534
1962	వీకే ఆదినారాయణ రెడ్డి	సీపీఐ	రామచంద్రగౌడు	ఇండిపెండెంట్	1,463
1967	రామచంద్రగౌడు	ఇండిపెండెంట్	తక్కెళ్లపల్లి పాపాసాహెబ్	కాంగ్రెస్	4,349
1972	డి. వెంకట రెడ్డి	ఇండిపెండెంట్	ఆర్. సుల్తాన్	కాంగ్రెస్	471
1978	కె. వెంకటరామయ్య	కాంగ్రెస్	జాఫర్‌సాబ్	జనతాపార్టీ	6,241
1983	పత్తి రాజగోపాల్	టీడీపీ	వెంకటరామయ్య	కాంగ్రెస్	26,552
1985	ఎన్. గాదిలింగప్ప	టీడీపీ	అరికెరి జగదీశ్	కాంగ్రెస్	4,467
1989	అరికెరి జగదీశ్	కాంగ్రెస్	సాయినాథ్ గౌడు	టీడీపీ	1,613
1994	ఎన్. గాదిలింగప్ప	టీడీపీ	సాయినాథ్ గౌడు	ఇండిపెండెంట్	10,778
1999	సాయినాథ్ గౌడు	టీడీపీ	ఎన్.గాది లింగప్ప	కాంగ్రెస్	34,464
2004	ఎన్. నీలావతి	కాంగ్రెస్	కేసీ నారాయణ	టీడీపీ	8,712
		2009లో గుంతకల్లు నియోజకవర్గ ఆవిర్భావం			
2009	కె. మధుసూదన్ గుప్త	కాంగ్రెస్	సాయినాథ్‌గౌడు	టీడీపీ	9,344
2014	ఆర్. జితేంద్రగౌడు	టీడీపీ	వెంకటరామిరెడ్డి	వైసీపీ	5,094
2019	వై. వెంకట రామిరెడ్డి	వైసీపీ	జితేంద్రగౌడు	టీడీపీ	48,532

మూతపడిన కుట్టు శిక్షణాకేంద్రం

కుట్టుమిషన్ల తరలింపు
పట్టించుకోని ప్రభుత్వం





పామిడి: పామిడి పట్టణం వస్త్ర వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగి రెండో బాంబేగా గుర్తింపు పొంది వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ.. నాణ్యమైన దుస్తులకు కేరాఫ్‌గా నిలిచింది. పట్టణ ప్రజలు దర్జీ వృత్తితో దర్జాగా జీవితం గడుపుతున్నారు. దర్జీ వృత్తికి టెక్స్‌టైల్స్ పార్కు ఎంతగానో దోహదపడుతుందని 2004 ఫిబ్రవరి 19వ తేదీన అప్పటి పశు సంవర్థక శాఖ మంత్రి నిమ్మల కిష్టప్ప, అనంతపురం పార్లమెంట్ సభ్యుడు కాలవ శ్రీనివాసులు భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. రూ. 120 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన టెక్స్‌టైల్ పార్కును 2010 అక్టోబర్ 29వ తేదీన అప్పటి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని యువతులు, మహిళలకు కుట్టుపై శిక్షణ ఇచ్చి నైపుణ్యాన్ని సాధించి వారి స్వయం ఉపాధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలు భావించారు. 2014లో టీడీపీ హయాంలో వినియోగానికి నోచుకున్న ఈ టెక్స్‌టైల్స్ పార్కు వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా మూతపడిపోయింది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో ప్రభుత్వం ఎంతో ఘనమైన లక్ష్యంతో నిర్మించిన టెక్స్‌టైల్ పార్కు మూత పడింది. దీంతో ఎంతో మంది యువతులు శిక్షణతో పాటు స్వయం ఉపాధిని కోల్పోతున్నారు. గత ప్రభుత్వ లక్ష్యం ఘనంగా ఉన్నా అధికారుల నిర్లక్ష్యం.. పాలకులు పట్టించుకోక పోవడంతో ఆచరణకు నోచుకోక టెక్స్‌టైల్ పార్కు నిరుపయోగంగా మారడంపై మహిళలు, యువతులు పెదవి విరుస్తున్నారు.

విప్లవజ్యోతి తరిమెల



తరిమెల నాగిరెడ్డి

అనంతపురం కల్చరల్

యుక్తవయసులోనే మార్క్సిజం వైపు అడుగులు
ప్రజానేతగా బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కృషి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేరెన్నికగల కమ్యూనిస్టు నాయకుల్లో తరిమెల నాగిరెడ్డి ఒకరు. ఈయన అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో రైతుకుటుంబంలో 1917 ఫిబ్రవరి 11న జన్మించాడు. తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, నాగలక్ష్మమ్మ. పాఠశాల రోజుల నుంచే సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా తిరుగబడే లక్షణాలను నాగిరెడ్డి కనబర్చాడు. యుక్తవయసులోనే వివేకానందుడు, రామకృష్ణ పరమహంస, గాంధీ ప్రభావం నుంచి మార్క్సిజం వైపు ఆకర్షితులై పీడిత ప్రజలకోసం నిరంతరం తపించాడు. 1940లో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజుల్లో 'యుద్ధం - ఆర్థిక ప్రభావం' అన్న రచనతో అందరినీ ఆలోచింపజేశారు. అయితే ఈ పుస్తకం రాసినందుకు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ ఆగ్రహానికి గురై జైలుకు వెళ్లాడు. తిరుచిరాపల్లి జైలు నుంచి విడుదలవగానే మరలా 1941లో భారతీయ రక్షణ చట్టం కింద అరెస్టయ్యాడు. 1946లో ప్రకాశం ఆర్డినెన్సు కింద అరెస్టయ్యి 1947లో విడుదలయ్యారు.

బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికే జీవితం అంకితం

1952లో నాగిరెడ్డి మద్రాసు శాసనసభకు సీపీఐ అభ్యర్థిగా అనంతపురం నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యాడు. జైలులో ఉండికూడా ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, తన బావ అయిన నీలం సంజీవరెడ్డిపై విజయం సాధించి సంచలనం సృష్టించాడు. 1955లో కొత్తగా ఏర్పడిన పుట్లూరు నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీచేసి తరిమెల రామచంద్రారెడ్డి చేతిలో ఓడిపోయాడు. 1957లో అనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2వ లోక్‌సభకు ఎన్నికయ్యాడు. తిరిగి 1962లో పుట్లూరు నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు సీపీఐ అభ్యర్థిగా పోటీచేసి తరిమెల రామచంద్రారెడ్డిని ఓడించి ఎన్నికయ్యాడు. 1967లో నియోజకవర్గాల పునర్విభజనలో పుట్లూరు నియోజకవర్గం రద్దు కాగా... సీపీఐ(ఎం) అభ్యర్థిగా అనంతపురం నియోజకవర్గం నుంచి మూడో పర్యాయం శాసనసభకు ఎన్నికయ్యారు. 1968 మార్చి నెలలో శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1969లో నాగిరెడ్డి సీపీఐ(ఎం) నుంచి విడిపోయి ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్టు రెవల్యూషనరీస్(ఏపీసీసీఆర్) - ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమకారుల సమన్వయ కమిటీని స్థాపించాడు. సీపీఐ(ఎం) కార్యకర్తలను కొత్తపార్టీలోకి ఆకర్షించడంలో సఫలమయ్యాడు. 1976లో మరణించేదాకా ఏపీసీసీఆర్ నాయకుడిగా కొనసాగిన నాగిరెడ్డి ప్రజలకు నిరుపమాన సేవలందించారు. తన జీవితాన్ని అణగారిన, బడుగు, బలహీనవర్గాల ప్రజల అభివృద్ధికే ఆయన అంకితం చేసి, ప్రజా ఆప్తబంధువుగా నిలిచారు. నాగిరెడ్డి 1976 జూలై 28న మరణించాడు.



రిషివ్యాలీ స్కూల్‌లో సహచరులతో..



తాడిపత్రి బహిరంగ సభలో నీలం సంజీవరెడ్డితో తరిమెల నాగిరెడ్డి

విజ్ఞాన రుషి.. వీకే



వీకే ఆదినారాయణరెడ్డి

బహుముఖ ప్రజ్ఞాశాలిగా కమ్యూనిస్టు ఉద్యమానికి సేవలందించిన ధన్యజీవి కామ్రేడ్ వీకే ఆదినారాయణరెడ్డి. ఈయన 1917 అక్టోబరు 8న చీమలవాగుపల్లి గ్రామంలో సంపన్న రైతు కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశ నుంచే జాతీయ భావాలవైపు ఆకర్షితుల య్యారు. విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. 1943 నాటికి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. పార్టీ నిర్ణయం మేరకు వ్యవసాయ కార్మిక పోరాటాలు నిర్వహించారు. చీమలవాగుపల్లె, తరిమెల గ్రామాల్లో కూలీల పోరాటాలకు ఈయన నాయకత్వం వహించారు. 1952 ఎన్నికల తర్వాత పార్టీ నిర్ణయం మేరకు వీకే తన నివాసాన్ని గుంతకల్లుకు మార్చారు. రైల్వే కార్మికులను సంఘటితం చేయడం, స్థానిక గూండాల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడటం అక్కడ నిత్యకృత్యం అయింది. ఈ క్రమంలోనే గుత్తి, గుంతకల్లు రైల్వే కార్మికుల్లో కమ్యూనిస్టు పార్టీని నిర్మించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో గుత్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు విశేషంగా కృషి చేశారు. జిల్లా కరువు, నీటి పారుదల అంశాలపై ఆయనకు ఎంతో పట్టు ఉండేది. జిల్లాలో కరువు శాశ్వత నివారణకు జీవితకాలం తపించారు. రాయలసీమ అభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించిన జ్ఞాని. నీటి ప్రాజెక్టులతోపాటు పరిశ్రమలు కావాలని జిల్లాలో ఉన్న భూగర్భ ఖనిజ సంపద ఆధారంగా వాటిని నిర్మించాలని అధికారులను, ప్రభుత్వాలను తరచూ డిమాండ్ చేసేవారు. తుదిశ్వాస విడిచేవరకూ ప్రభుత్వాలపై నిర్మాణాత్మక విమర్శలు చేశారంటే అతిశయోక్తి కాదు.

కోటయ్యా..! నీవే దిక్కు

ఎన్నికలు ఏవైనా కాటకోటేశ్వరుడి కరుణ కోసం అభ్యర్థుల క్యూ

తాడిమర్రి



ఎన్నికలు ఏవైనా అభ్యర్థులు కాటకోటేశ్వరుడి దీవెనల కోసం క్యూకడతారు. మండలంలోని చిల్లవారిపల్లిలో ఈ క్షేత్రం ఉంది. ధర్మవరం నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉన్న ఏకైక పుణ్య క్షేత్రం కావడంతో అభ్యర్థులు ఇక్కడి నుంచే తమ ప్రచారం ప్రారంభిస్తుంటారు. చాలామంది అభ్యర్థులు స్వామిని దర్శించుకుని పూజలు చేసిన తర్వాతే నామినేషన్లు, ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తుంటారు. ఇప్పటికే కూటమి తరపున పోటీ చేస్తున్న సత్యకుమార్ కాటకోటేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ గ్రామం నుంచి ప్రచారం ప్రారంభిస్తే అంతా మంచే జరుగుతుందని వివిధ పార్టీల నాయకుల నమ్మకం.

ఇచ్చింది గోరంతే..

ధర్మవరం



ఐదేళ్ల కాలంలో జగన్ ఏ ఒక్క పథకం మాకు ఇవ్వలేదు. నేతన్న నేస్తం కూడా మాలాంటి వాళ్లకు దక్కలేదు. సొంత మగ్గాలుంటేనే ఆ పథకం వర్తిస్తోంది. కూలి మగ్గం నేసుకునే వారికి మాత్రం పైసా దక్కలేదు. గోరంత ఇచ్చి కొండంతా లాగేసుకున్నారు. సీఎం జగన్ ధర్మవరం వచ్చినప్పుడు చేనేతలకు న్యాయం చేస్తానని, పెద్ద పెద్ద మార్కెట్ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లు అవుతున్న మాలాంటివాళ్లను పట్టించుకున్నదే లేదు. చేనేత సమస్యలు ఎన్నో ఉన్నాయి. వాటి గురించి పట్టించుకునే వారేలేరు. ఇంత అన్యాయమైన ప్రభుత్వాన్ని నేనెప్పుడు చూడలేదు.

మా పార్టీకి ఓటేయకపోయారో..?

వృద్ధులు, దివ్యాంగులకు వైసీపీ బెదిరింపు

కొత్తచెరువు



వృద్ధులు, దివ్యాంగుల ఓట్లకు వైసీపీ గాలం వేస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే ఓటు వేసే సదుపాయం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో వారి ఓట్లను కొల్లగొట్టడానికి క్షేత్రస్థాయిలో గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడుపుతోంది. వైసీపీ నాయకులు వలంటీర్లతో కలిసి రాత్రి సమయాల్లో వారి వద్దకు వెళ్లి వచ్చే ఎన్నికలలో వైసీపీకి ఓటు వేయాలని ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఇన్నేళ్లుగా మేమే మీకు ఇళ్ల వద్దకు పింఛన్ ఇచ్చాం. మళ్లీ కూడా వైసీపీ ప్రభుత్వమే వస్తుంది. మీరు మా పార్టీకి ఓటు వేయకపోతే తర్వాత మీకు పింఛన్ ఇవ్వము అని బెదిరింపులకు సైతం దిగుతున్నట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 85 ఏళ్లపైబడిన వృద్ధులు77,228 మంది, దివ్యాంగులు 18,095 మంది ఉన్నారు. వీరిని ఇప్పటికే ఆయా బీఎల్‌ఓలు గుర్తించారు.

ఇంటి నుంచే నామినేషన్

సువిధ యాప్‌తో అవకాశం

ఉరవకొండ

ఎన్నికల ప్రక్రియను సులభతరం చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ఈక్రమంలోనే లోక్ సభ, శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇంటి నుంచే నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం ఎన్నికల సంఘం సువిధ.ఈసీఐ.గవర్నమెంట్.ఇన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ నెల 25వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. అభ్యర్థులు నేరుగా వచ్చి ఆర్వోకు సమర్పించడం లేదా ఆన్‌లైన్ ద్వారా అందించే వీలు ఉంటుంది. ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లో కమిషన్ సూచించిన వివరాలు నమోదు చేసి, ధ్రువపత్రాలు జతచేయాలి. ఆస్తుల వివరాలు, అఫిడవిట్ పత్రాలు, నామినేషన్ బలపరిచేందుకు ఐదుగురి వివరాలు నమోదు చేయాలి. అవసరమైన పత్రాలు సమర్పించిన తర్వాత వాటిని ప్రింట్ తీసి నామినేషన్ దాఖలుకు స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో సమర్పించిన పత్రాలతో మూడు సెట్లు ఎన్నికల అధికారిని కలిసి గడువులోగా అందజేయాలి. నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు సమయంలో అభ్యర్థులు అందుబాటులో లేకుంటే వారి మద్దతుదారులు హాజరుకావచ్చు.

పొద్దుగూకినా అంతే..!

అక్కాజంపల్లిలో అమలుకు నోచుకోని హామీలు



బ్రిడ్జి నిర్మిస్తానన్నది ఇక్కడే..

పామిడి

పొద్దు గూకినా(వైసీపీ ప్రభుత్వ కాలపరిమితి పూర్తయినా) 2019లో సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఇచ్చిన హామీలు అమలు కాలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిసారీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు పుల్లేటి వంక వంతెన, తారురోడ్డు నిర్మించాలని గ్రామస్థులు తెలియజేయడం పరిపాటిగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో అక్కాజంపల్లికి మట్టిరోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. టీడీపీ హయాంలో ఎదురూరు వరకూ తారురోడ్డు నిర్మించారు. ఈసారైనా ప్రజాప్రతినిధులు పుల్లేటివంకలో వంతెనను, తారురోడ్డు నిర్మించాలని కోరుతున్నాము.

ఊరి కోసం ఓటు..!

అప్పట్లో గ్రామ సమస్యలే ముఖ్యం

గార్లదిన్నె



సి నాగిరెడ్డి

అప్పట్లో ఎన్నికల ప్రచారం ఇంత హడావుడిగా ఉండేది కాదు. గ్రామాలకు ప్రచారానికి వెళ్లే అభ్యర్థులు కూడా తమ వాహనాలను ఊరి బయటే ఉంచి నడుచుకుంటూ వచ్చేవారు. ఊర్లోల్లోని పెద్ద మనుషులతో మాట్లాడి గ్రామసమస్యలు తెలుసుకుని, గెలిస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చేవారు. గ్రామ పెద్దలు కూడా తమ స్వార్థం కోసం కాకుండా ఊరికి ఉపయోగపడే పనులనే అభ్యర్థులను చేయమని అడిగేవారు. ఈక్రమంలో గ్రామ పెద్దల మాట మీద గ్రామస్థులందరూ వారు చెప్పినవారికి ఓటేసేవారు. ఇప్పుడు ఓ స్థాయి నాయకుడు గ్రామానికి వచ్చినా డప్పులు, పూలదండలు పూలు చల్లుకుంటు ఆర్భాటాలు చేస్తున్నారు. ఓటేయమంటే 'నాకేంటి' అని ముఖం మీదే అడుగుతున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో ఇంటికి ఇద్దరు, ముగ్గురు నాయకులు తయారయ్యారు. దీంతో రాజకీయం అంటే విలువ లేకుండా పోయింది.

70 మంది వలంటీర్ల రాజీనామా

నార్పల: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన 70 మంది వలంటీర్ల రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ రాముడు శుక్రవారం తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసమే వీరంతా రాజీనామా చేసినట్లు సమాచారం.

కూటమి మహా ఉప్పెన

నందమూరి బాలకృష్ణ

హిందూపురం, ఏప్రిల్ 19: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మహా ఉప్పెన అంటూ హిందూపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ శుక్రవారం అన్నారు. నామినేషన్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు పార్టీల కూటమిని తట్టుకునే శక్తి ఎవరికీ లేదన్నారు. హిందూపురం ప్రజలు ఎన్టీఆర్‌ని మూడు సార్లు గెలిపించారు. నియోజకవర్గం ప్రజలంతా మా కుటుంబ సభ్యులే. వారు మా కుటుంబాన్ని తమ గుండెల్లో పెట్టుకున్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని నాన్న గారి మాటను స్ఫూర్తిని తీసుకొని రెండు సార్లు గెలిచానన్నారు. సొంత నిధులతో సేవ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అన్న క్యాంటీన్ తొలగించినా రోజూ 400 మందికి భోజనం పెడుతున్నట్లు వెల్లడించారు. వైసీపీ పాలనలో అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. ఎన్టీఆర్ పారిశ్రామిక వాడ తీసుకువస్తే చంద్రబాబు పరిశ్రమలు తీసుకువచ్చారని కితాబునిచ్చారు. తాను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఈ నియోజకవర్గాన్ని మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా అన్నారు. రెట్టింపు ఉత్సాహంతో పనిచేయడానికి ప్రజలు మూడోసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

పీకిపారేస్తాం..!

వలంటీర్లకు ఎంఎల్ఓ బెదిరింపులు

విడపనకల్లు, ఏప్రిల్ 19: 'మండలంలోని ప్రతి గ్రామంలోని వలంటీర్లు రాజీనామా చేయాలి. అలా చేయనివారిని ప్రభుత్వం వచ్చాక తొలగిస్తాం' అంటూ ఎంఎల్ఓ కుళ్లాయప్ప మండల వలంటీర్లకు వాయిస్ మెసేజ్ పంపాడు. మండల వలంటీర్లు అందరూ రాజీనామా చేయాలని, రాజీనామా చేసినంత మాత్రాన వారిని తొలగించినట్లు కాదని, ప్రభుత్వం వచ్చిన వెంటనే వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని పేర్కొన్నారు. పై నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని అందుకే అందరూ రాజీనామా చేయాలని తెలిపారు. ఇప్పటికే హావళిగి గ్రామంలోను, ఇతర గ్రామాల్లోను వలంటీర్లందరూ రాజీనామా చేశారు. మిగిలినవారు కూడా రాజీనామా చేసి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రాజీనామాలు చేయకపోతే రాబోవు రోజుల్లో ఇబ్బంది పడతారని హెచ్చరించారు. దీనిపై పలువురు వలంటీర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈపొద్దే రాజీనామా చేయల్ల..

శింగనమల: ఏమప్పా..! మన మండలంలో ఉండే వలంటీర్లంతా శనివారంలోపల రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనాల. మన పార్టీ అభ్యర్థిని గెలిపించాల' అని శింగనమల మండల వైసీపీ నాయకుడు వలంటీర్లుకు హుకుం జారీ చేశారు. శుక్రవారం శింగనమలలో గ్రామ వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆ నాయకుడు మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి వలంటీర్లుగా ఉన్న వాళ్లంతా ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు అడ్డు వస్తాయి కాబట్టి శనివారంలోపు వలంటీర్లందరూ రాజీనామాలు చేయాలని ఆదేశించారు. వచ్చే రెండు నెలలకు జీతాలు ఇప్పిస్తామన్నారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే కాబట్టి మళ్లా మిమ్మల్నే వలంటీర్లుగా నియమిస్తామన్నారు. రాజీనామాకు ఒప్పుకోనివారితో బలవంతంగానైనా చేయించాలని గ్రామ వైసీపీ నాయకులకు బాధ్యతలు అప్పజెప్పారు.

ప్రచారంలో పెనుమార్పులు



ఇటీవల కదిరిలో ఎన్నికల ప్రచారానికి హెలికాప్టర్‌లో వచ్చిన నందమూరి బాలకృష్ణ

కాలి నడక నుంచి హెలికాప్టర్ దాకా..
పల్లెల్లో వాహనాల బారులు
ఆకాశ మార్గంలో ప్రముఖులు
తప్పెట స్థానంలో డీజే
చెట్ల నీడ నుంచి షామియానాల్లోకి..

ఎన్నికల ప్రచారంలో నాటికి నేటికి ఎన్నో మార్పులు వచ్చాయి. కాలినడక నుంచి ఆకాశ మార్గంలో వచ్చేస్థాయికి పరిస్థితులు మారిపోయాయి. ఒకప్పుడు పల్లెలకు నాయకులు జీపుల్లో వచ్చి ఓట్లడిగేవారు. ఇప్పుడు ఆర్భాటాలు పెరిగిపోయాయి. ఒక పల్లెలో ఉన్న ఓటర్ల కంటే అభ్యర్థి వెంట వచ్చే అనుచరగణమే అధికంగా ఉంటోంది. కనీసం అభ్యర్థి ముఖం కూడా చూడడానికి వీలులేకుండా వారే చుట్టూ హడావుడి చేస్తుంటారు. ప్రచారం లో తప్పెట్ల స్థానంలో డీజేలు వచ్చాయి. ప్రతి అభ్యర్థి తన ఘనతను చాటుకుంటూ సొంతంగా పాటలు తయారు చేయించుకుని తన డప్పు తనే కొట్టుకునే స్థాయిలో ప్రచార హోరు కనిపిస్తోంది.

హిందూపురం, ఏప్రిల్ 19: ఎన్నికల ప్రచారంలో ప్రతిసారి విన్నూత్న మార్పులు కనిపిస్తున్నాయి. నాడు అభ్యర్థులు కాలి నడకన గ్రామాలను తిప్పేసేవారు. మైళ్ల దూరం నడిచి ప్రజలను కలిసే వారు. ఆ తరువాత ఎడ్ల బండ్లు, సైకిళ్లు, మహా అయితే జీపుల్లో అభ్యర్థులు తిరిగి ప్రచారం చేపట్టేవారు. రానురాను జీపుల వినియోగం పెరిగింది. ఆ తరువాత అంబాసిడర్ కార్లు వచ్చాయి. ఆ తరువాత నాయకులు ఖరీదైన కార్లు, ఇతర వాహనాలను ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు రిక్షా బండిపై మైకు కట్టుకొని అభ్యర్థులు వెళ్లేవారు. కానీ నేడు డీజేలు, మరిన్ని అత్యాధునిక పరికరాలు ఉపయోగిస్తున్నారు. ఇటీవల వాహనాల వినియోగం పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగా ప్రచారం సమయంలో కూడా అభ్యర్థులు అధిక సంఖ్యలో వాహనాలు ఉపయోగిస్తున్నారు. ఇటీవల పెనుకొండ నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఏకంగా వంద వాహనాలతో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఎక్కడ అభ్యర్థి ప్రచారానికి వెళ్లినా పదుల సంఖ్యలో వాహనాలు కనిపిస్తున్నాయి. వారితో పాటు ముఖ్య అనుచరులు, నాయకులు అధిక సంఖ్యలో వాహనాలతో వెళ్లి తమ బలాన్ని చూపుతున్నారు.

ఆకాశ మార్గాన ప్రముఖులు

పార్టీ అధ్యక్షులు, ప్రముఖులు సభలకు హెలికాప్టర్లు వినియోగిస్తున్నారు. వందల కిలోమీటర్ల దూరంలో సభలు ఉంటే సమయానికి చేరుకోవడానికి వీలు ఉండదు. దీంతో తక్కువ సమయంలో సభలకు హాజరుకావడానికి హెలికాప్టర్లు వినియోగిస్తున్నారు. ఒకప్పుడు ఎంత పెద్ద సభ అయినా వాహనాల్లో వెళ్లేవారు. నేడు నిమిషాల్లో ఆకాశ మార్గాన సభల ముందు వాలిపోతున్నారు.

చెట్ల నీడపోయి షామియానా వచ్చె..

దేశంలో ఎన్నికలు వచ్చిన తొలినాళ్లలో చెట్ల కింద సభలు, సమావేశాలు నిర్వహించేవారు. పల్లెల్లో అయితే ఊరు మధ్యలో చెట్ల నీడన అరుగు కట్టల వద్దకు అందరిని తీసుకువచ్చి ఓటు అడిగేవారు. చెట్ల నీడనే సభలను ఏర్పాటు చేసుకునేవారు. నేతల ప్రసంగాలు నేలపై కూర్చొని వినేవారు. మారిన కాలానుగుణంగా సభలు సమావేశాలు నిర్వహించాలంటే పెద్ద పెద్ద మైదానాల్లో షామియానాలు, టెంట్లు వేసి ఓటర్లకు కూడా కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. మరీ జనం తక్కువగా ఉంటే కల్యాణ మండపాల్లో, నగరాల్లో అయితే ఏసీ ఉన్న ఫంక్షన్ హాళ్లలో సభలు నిర్వహిస్తున్నారు. అప్పట్లో పగలు మాత్రమే సభలు నిర్వహించేవారు. ఇప్పుడు రాత్రి సమయంలో కూడా ఎల్ఈడీ దీపాలు వేసి సభలు నిర్వహిస్తున్నారు.

ప్రచారంలో పాటల సందడి

ఒకప్పుడు పల్లెల్లో అభ్యర్థి ప్రచారం చేసుకునే సమయంలో తప్పెట్లు కొడుతూ వెంట ఉన్న వారిని ఉత్తేజపరిచేవారు. కానీ ఇప్పుడు కొత్త కొత్త ప్రచార పాటలను రూపొందించి ప్రజల్లో ఉత్సాహాన్ని తీసుకువస్తున్నారు. అప్పట్లో ప్రతి పార్టీకి కళాకారుల బృందం ఉండేది. అభ్యర్థి సభాప్రాంగణానికి చేరుకునే ముందుగానే కళాకారులు చేరుకొని వారి నృత్యాలతో ప్రజలను ఉత్సాహపరిచేవారు. ఇప్పుడు రికార్డింగ్ పాటలతో పట్టణాల్లో పల్లెల్లో వీధుల్లో తిప్పుతున్నారు. అభ్యర్థి సేవలు, చేసిన అభివృద్ధి పనులపై పాటలను రూపొందించి హోరెత్తిస్తున్నారు. కొందరైతే ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా నేతల ప్రసంగాలను వినిపిస్తున్నారు. ఇలా ప్రచార శైలిలో విన్నూత్న మార్పులు వచ్చాయి.

తోపుదుర్తి అనుచరుల హల్‌చల్

యథేచ్ఛగా 144 సెక్షన్ ఉల్లంఘన
చోద్యం చూసిన పోలీసులు

రాప్తాడు, ఏప్రిల్ 19: స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనుచరులు నామినేషన్ (తహసీల్దార్) కార్యాలయం వద్ద 144 సెక్షన్ నిబంధనలను ఉల్లంఘించారు. నామినేషన్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను ఎక్కువ మంది దాటుకుని వెళ్లి తమ అధికార దర్పాన్ని చూపారు. అడ్డుకోవాల్సిన పోలీసులు అధికార పార్టీ వారిని ఏమి అనకుండా స్వామి భక్తిని చూపారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరపున నామినేషన్ వేసేందుకు ఆయన తల్లిదండ్రులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, ప్రేమకుమారి, సోదరులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ శుక్రవారం తమ అనుచరులతో కలిసి వచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆ ప్రదేశంలో 144 సెక్షన్ అమలులో ఉంది. నిబంధనల మేరకు నామినేషన్ దాఖలు చేసేందుకు ఐదుగురు మాత్రమే వెళ్లాలి. అందుకు విరుద్ధంగా సుమారు 100 మంది బారికేడ్లు దాటుకుని వెళ్లారు. వైసీపీ కార్యాలయం వైపు నుంచి కొందరు, పోలీస్ స్టేషన్ వైపు నుంచి కొందరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కొందరు వచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కార్యాలయం ఆవరణ నుంచి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిని గేటు వేసి మూసివేశారు. వైసీపీ నాయకులు వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి గేటు తాళాలు తీయించి నామినేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. నామినేషన్ కార్యాలయం గేటు వద్ద కూడా 10 మంది లోపలికి వెళ్లారు. సీకే పల్లి తహసీల్దార్ ఐదుగురి కంటే ఎక్కువ లోపలికి వెళ్లకూడదని చెప్పినా ఏడుగురు వెళ్లి నామినేషన్ వేశారు. ప్రకాష్‌రెడ్డి తరపున ఆయన తల్లి ప్రేమకుమారి నామినేషన్ సమర్పించారు. నామినేషన్ కేంద్రం నుంచి బయటకు వచ్చాక 144 సెక్షన్ అమలులో ఉన్న స్థలంలో వైసీపీ శ్రేణులతో కలిసి గుంపులుగా ఫొటోలు దిగారు. ఈ సంఘటనపై రాప్తాడు సీఐ మునిస్వామి మాట్లాడుతూ బారికేడ్లు దాటి ఐదుగురి కంటే ఎక్కువ మంది వెళ్లకూడదన్నారు.



రాప్తాడులో 144 సెక్షన్ అమలులో ఉన్న స్థలంలో గుంపులు, గుంపులుగా ఉన్న వైసీపీ శ్రేణులు

ఓ చెంబుకథ !

అత్యాశకు పోతే రూ.45లక్షలు పోయింది

కదిరి, ఏప్రిల్ 19: అత్యాశ ఎంతటి మనిషినైనా మోసపోయేలా చేస్తుంది. ఇందుకు మంచి ఉదాహరణే ఈ చెంబు కథ. ఇందులో బాధితుడు ఈ ఎన్నికల్లో ప్రజాప్రతినిధిగా గెలవడానికి ఉవ్విళ్లూరుతున్న వ్యక్తి కావడం గమనార్హం. ఓమండలస్థాయి నాయకుడికి రైస్‌పుల్లింగ్, చెంబుల వ్యాపారం చేసి ప్రజలను మోసం చేసే అలవాటుంది. ఇన్నిరోజులు కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణాల్లో చెంబుపేరు చెప్పి పలువురుని మోసం చేసినట్లు సమాచారం. ఈక్రమంలో మోసం చేయడానికి ఈసారి కదిరిలోని ఓ రాజకీయనాయకున్ని ఎన్నుకున్నాడు. అన్నా నాకు చెంబువ్యాపారం వచ్చింది రూ.మూడుకోట్లు ఇస్తారు. ఇప్పుడు అర్జంటుగా రూ.40 లక్షలు కావాలి. ఈ డబ్బు వారిచ్చే రూ. మూడుకోట్లలో పట్టుకోండి అంటూ నమ్మబలికాడు. ఆ నాయకుడు అత్యాశతో రూ.40లక్షలు ఇచ్చేశాడు. ఈతరువాత మరో రూ.5లక్షలు కావాలని చెబితే అదికూడా ఇచ్చినట్లు సమాచారం. రోజులు గడుస్తున్నా కోట్ల డబ్బు ఖాతాలో పడకపోవడంతో, ఆ రాజకీయనాయకుడికి అనుమానం మొదలైంది. దీంతో తీసుకున్న డబ్బు ఇవ్వాలని మండల నాయకుడిని అడిగాడు. అతను మాత్రం ఇదిగో అదిగో అంటూ కాలం గడిపేశాడు. చివరకు ఫోన్ కూడా ఎత్తకపోవడంతో ఆ నాయకుడు ఓ పోలీసు ఉన్నతాధికారిని సంప్రదించినట్లు సమాచారం. ఆయన ఈవ్యవహారాన్ని గుట్టు చప్పుడుకాకుండా పరిష్కరించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మొత్తం మీద అత్యాశకుపోయి రూ.45లక్షలు పోగొట్టుకున్న రాజకీయనాయకుడి పరిస్థితి తేలుకుట్టిన దొంగలా ఉందని తెలిసింది.

పుట్టపర్తి, ఏప్రిల్ 19: బుక్కపట్నం చెరువు ముంపు రైతులకు పరిహారం ఇపిస్తానని చేతిలో చెయ్యి వేసి చెప్పి ఓట్లు వేయించుకున్నాడు. గట్టెక్కిన తర్వాత మరిచిపోయాడని పలువురు బాధితులు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సమస్యలను రైతు లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎన్నికలు ముగిసిన ఆరునెలల్లోపు ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం ఇప్పిస్తానని నమ్మబలికారు. అయితే ఏళ్లు గడుస్తున్నా పైసా పరిహారం రాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం ఇప్పించలేకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగను అని అప్పట్లో ధీమాగా హామీ ఇచ్చారు. ఇప్పుడు మళ్లా ఏ ముఖం పెట్టుకుని ఓట్లడిగేకి వస్తాడో చూస్తామంటూ బాధితులు పేర్కొంటున్నారు.

ఏ ముఖంతో ఓట్లడుగుతాడో చూస్తాం

ఎమ్మెల్యేపై బుక్కపట్నం చెరువు ముంపు బాధితుల ఆగ్రహం
దుద్దుకుంట హ్యాండిచ్చారంటున్న బాధితులు



నీటమునిగి ఎండిన మామిడిచెట్లు

● చెరువు పరిధిలో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలకు చెందిన 450 మంది రైతులకు 465 ఎకరాల భూమి ఉంది. చెరువులో నీరు లేనప్పుడు రైతులు పంటలు సాగు చేసేవారు. చెరువును కృష్ణజలాలను నింపడంతో రైతులు ఉపాధి కోల్పోయారు. టీడీపీ హయాంలో రెండు సార్లు కృష్ణాజలాలతో బుక్కపట్నం చెరువును నింపారు. ముంపు రైతులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇందు కోసం ప్రతిపాదనలు సైతం ప్రభుత్వానికి పంపారు. అయితే 2019లో ఎన్నికలు రావడం వైసీపీ గెలవడంతో అవి మూలనపడ్డాయి.


మామిడిచెట్లు ఎండిపోయాయి



బాగా నిండుగా కాపు కాస్తున్న 300 మామిడిచెట్లు నీట మునిగి ఎండిపోయాయి. దీంతో లక్షల రూపాయలు నష్టపోయా. పశుగ్రాసం సైతం నీటమునిగిపోవడంతో పాడిపశువులు కూడా అమ్ముకున్నా. కడుపునింపుతున్న భూములు నీట మునగడంతో బతుకుతెరువును కోల్పోయాం. ప్రభుత్వాలు మారిన పరిహారం రాలేదు. మా బతుకులు మారలేదు.

- హరి, రైతు, జానకంపల్లి


చేతిలో చేయి వేసి చెప్పాడు



మున్సిపల్ ఎన్నికలలో మా ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చెరువు ముంపు భూముల గురించి చెప్పగానే చేతిలో చేయి వేసి ఆరు నెలలోగా పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. ఏళ్లు గడిచిన హామీ నెరవేరలేదు.

-కరణం భువనేశ్వర్, రైతు, పుట్టపర్తి

బుక్కపట్నం చెరువు



ఉపాధి కోల్పోయా..

ఉన్న నాలుగెకరాల భూమిలో వేరుశనగ, వరి మొక్కజొన్న పంటలు సాగుచేసేవాళ్లం. భూమినీటితో మునగడంతో ఐదేళ్లుగా పంట లేదు, తినడానికి గింజలులేవు. పరిహారం ఇస్తామన్నారు. మాట మరచిపోయారు.

- భీమనేని కిష్టప్ప, రైతు, పుట్టపర్తి

అధిక ఖర్చులపై ఫిర్యాదు చేయండి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 19: ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు నిబంధనల మేరకే ఖర్చులు పెట్టాల్సి ఉంటుందని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి. షిండే తెలిపారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి ఫిర్యాదులను ఫోన్‌లో తెలపాలన్నారు. అనంతపురం పార్లమెంటుకు సంబంధించి కేంద్ర వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే ఫోన్‌నెంబరు (9408794122), రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాలకు సంబంధించి వ్యయపరిశీలకులు నితీష్‌అగర్వాల్ ఫోన్‌నెంబరు(8247832873) అనంతపురం అర్బన్, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు సంబంధించి వ్యయ పరిశీలకులు రందాస్ టీ.కాలే ఫోన్‌నెంబరు(80745 08600) నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని షిండే తెలిపారు. అలాగే ఏ ఫిర్యాదునైనా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 08554-234122, 08554-239822, 08554-231722, సెక్టోరియల్ మానటరింగ్ కోసం 08554-232922, 63009 07233 నెంబర్లకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టరు వినోద్‌కుమార్ కూడా తెలిపారు.

మేం ఓటేస్తాం.. మీరూ వేయండి

ఓటు చైతన్యంపై కేంద్ర ఎన్నికల పరిశీలకుడు, కలెక్టర్ సంతకాలు




సంతకం పెడుతున్న విలాస్ వి. షిండే

అనంతపురం టౌన్, ఏప్రిల్ 19: 'ఓటు విలువ ఎంతో గొప్పది.. మనకోసం పనిచేసే మంచి వ్యక్తులను ఎన్నుకోవడానికి ఈ ఓటు వజ్రాయుధం.. అలాంటి ఓటు ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి' అని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు.. ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఓటు చైతన్యంపై నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమాలలో భాగంగా కలెక్టరేట్‌లో భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల పరిశీలకులు విలాస్ వి. షిండే, నితిన్ అగర్వాల్, రందాస్ టి. కాలేతోపాటు కలెక్టర్ వినోద్‌కుమార్, కొత్తగా వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తదితరులు 'మేం ఓటేస్తున్నాం.. మీరూ నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయండి' అని కోరుతూ సంతకాలు చేశారు.

తారు పోయింది.. మట్టి మిగిలింది

అధ్వానంగా గాండ్లపెంట-ఎన్పీకుంట రోడ్డు



నంబులపూలకుంట, ఏప్రిల్ 19: ప్రతిపక్షనేతగా జగన్ మోహన్‌రెడ్డి కదిరి- ఎన్పీకుంట ప్రధాన రహదారి మీదుగా పాదయాత్ర కొనసాగించారు. అప్పట్లో తారురోడ్డు ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు చేస్తామని ఉన్న రోడ్డును విచ్చలవిడిగా తొలగించారు. కల్వర్టు అరకొరగా పూర్తి చేశారు. వాటిపైన మట్టి వేశారు. డబుల్‌రోడ్డు అంటూ ఒకవైపు గుంతలు తవ్వారు. మరోవైపు, కంకర పరిచారు. సంవత్సరాలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. కదిరినుంచి గాండ్లపెంట, ఎన్పీకుంట, అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు 32కిలోమీటర్ల వరకు ఈరోడ్డు పరిస్థితి అలాగే ఉంది. గతంలో 40 నిమిషాల్లో గమ్యస్థానాలు చేరుకునేవారు. ప్రస్తుతం రెండుగంటల సమయం ఇబ్బందికరంగా ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. తిరుమలకు ఈరహదారి గుండా వెళితే తక్కువ సమయంతోపాటు చార్జీలు తగ్గుతాయని చాలామంది భావిస్తుంటారు. ప్రస్తుతం రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఈరహదారి గుండా వెళ్లడానికి ప్రయాణికులు మొగ్గు చూపడంలేదు.

ధనియాన్ చెరువు ఆంజనేయస్వామి ఆలయం ఎగుడుదిగుడుగా ఉన్నమట్టి రోడ్డు

మా టైం వచ్చింది..!

జగన్‌కు రాజకీయ నిరుద్యోగి పోస్టు ఇస్తాం
తెలంగాణ పరిస్థితే ఆంధ్రాలో కూడా..
ఐదేళ్లలో కేవలం 368 పోస్టులతో నోటిఫికేషనా?
డీఎస్సీపైనే తొలి సంతకం అని బాబు చెప్పారు
స్టడీ పార్కులో 'ఆంధ్రజ్యోతి'తో నిరుద్యోగులు
టీడీపీ కూటమి వైపు నిరుద్యోగులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 19: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఈ ఎన్నికల తర్వాత రాజకీయ నిరుద్యోగం తప్పదని నిరుద్యోగులంటున్నారు. వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా ఐదేళ్లలో ఏనాడు ఉద్యోగాల భర్తీపై ఆయన పెదవి విప్పలేదని, ఎన్నికల వేళ అరకొర పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చాడని వారు మండిపడుతున్నారు. మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి జిల్లాలో కేవలం 368 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి దగా చేశాడని నిరుద్యోగులు ఫైర్ అవుతున్నారు. టెట్, డీఎస్సీకి మధ్య గడువు ఇవ్వకపోవడంతో అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. తర్వాత ఎన్నికల కోడ్ వల్ల డీఎస్సీ మూలన పడటంపై ఉద్యోగార్థులు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల స్టంట్ నడిపిన జగన్‌కు...ఎన్నికల్లో తామేంటో బుద్ధి చెబుతాం అంటూ నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు. అనంతపురం 2వ రోడ్డులోని స్టడీ పార్కులో 'ఆంధ్రజ్యోతి' పలువురు నిరుద్యోగులను పలకరించగా జగన్ పాలన, ఉద్యోగాల భర్తీపై ఇలా స్పందించారు.



పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు

ఆంధ్రజ్యోతి: ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో జగన్ ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంది..?

నిరుద్యోగులు : గతంలో ఎన్నికల ముందు జగన్ సుమారు 23 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ అన్నారు. ఓట్లు దండుకుని సీట్లో కూర్చోగానే స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులు తగ్గిస్తూ వచ్చారు. ఈ ఐదేళ్లు స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ లేవన్నట్టుగా లెక్కలు చూపారు. తీరా ఎన్నికలు వచ్చినప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ గుర్తుకు రావడం వింతగా ఉంది. ఈ ప్రభుత్వ వైఖరిని, విధానాలను ఈ ఐదేళ్లూ నిరుద్యోగులు చాలా గమనించారు.

ఆంధ్రజ్యోతి : డీఎస్సీ-2024 పట్ల మీరు సంతృప్తిగా ఉన్నారా..?

నిరుద్యోగులు: ఎన్నికల వెళ్లే ముందు హడావుడిగా ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే..ఎలా..? నోటిఫికేషన్ ఇచ్చారనుకుంటే....మరీ ఎన్నడూ లేని విధంగా కేవలం 368 పోస్టులు ఇచ్చారు. దాంట్లో ఎస్‌జీటీ పోస్టులు 107, స్కూల్ అసిస్టెంట్ 164, టీజీటీ పోస్టులు 115 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ఇంత దారుణమైన డీఎస్సీ నోటిఫికేషన్ మా జీవితాల్లో చూడలేదే. ఈ పోస్టులు, ఈ డీఎస్సీపై ఎవరూ సంతృప్తిగా లేరు.

ఆంధ్రజ్యోతి : జగన్ ఇచ్చిన పోస్టులు సరితాయా..?

నిరుద్యోగులు : గత ఐదేళ్లలో సుమారు 40 వేల మందికిపైగా డీఎస్సీ కోసం ఆశగా ఎదురు చూస్తుంటారు. ప్రభుత్వం ప్రస్తుతం నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టులు ఏమాత్రం సరిపోవు. కొందరు నాలుగు ఏళ్ల నుంచి మరి కొందరు ఆరేళ్లు, ఏడేళ్లుగా కష్టపడి చవుతున్నారు. ఎలాగైనా పోస్టులు కొట్టాలని ప్రిపేర్ అవుతుంటే...ఈ ఐదేళ్లూ ఆడుకున్న ప్రభుత్వం తీరా దిగిపోయే ముందు బోటాబోటీ పోస్టుల భర్తీకి దిగడంపై ప్రతి నిరుద్యోగి అసంతృప్తిగానే ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: టెట్, డీఎస్సీ ఒకేసారి వదిలారు కదా ఇబ్బంది లేదా?

నిరుద్యోగులు : టెట్, డీఎస్సీకి మధ్య కనీసం 45 రోజుల సమయం ఉండాలి. కానీ ఒకే నెలలోనే టెట్, డీఎస్సీ అంటే ఎలా కుదురుతుంది. ఇలా బుద్ధి లేకుండా ఎవరైనా ఇస్తారా..? ఆ పోస్టులు నిరుద్యోగులతో భర్తీ చేయడానికా...? లేక మేము నోటిఫికేషన్ ఇచ్చాం అని జగన్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోడానికా....? ఆ పోస్టులు, నోటిఫికేషన్ చూస్తే...కడుపు రగిలిపోతోంది.

ఆంధ్రజ్యోతి : మాది సంక్షేమ ప్రభుత్వం, ప్రజా పాలన అంటూ వైసీపీ చెప్పుకుంటోంది. దీన్ని మీరెలా చూస్తారు...?

నిరుద్యోగులు : సంక్షేమం అంటే బటన్ నొక్కి.. ఈ తోడు, ఆతోడు కింద రూ. 10వేలు వేయడం, అమ్మఒడి అంటూ రూ. 13వేలు వేయడమా? సంక్షేమంలో నిరుద్యోగులు ఉండరా..? వాళ్ల సంక్షేమం పట్టదా..?, రాత్రింబవళ్లు ఉద్యోగాల కోసం చదువుకునేవాళ్లకు సంక్షేమం అక్కరలేదా?, జగన్‌కు నిరుద్యోగుల బాధలు, జీవితాలు కనపడవా?

ఆంధ్రజ్యోతి: వచ్చే ఎన్నికల్లో మీరెటువైపు ?

నిరుద్యోగులు: ఈ ఐదేళ్లలో పాలన చూశాం. కడుపు మండుతోంది. ఏపీలో మాదిరే నిరుద్యోగులు, ఉద్యోగులతో ఆడుకున్న అధికార బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో కూలిపోయింది. మాకు జగన్ ప్రభుత్వంలో ఇచ్చిన డీఎస్సీపై నమ్మకం లేదు. ఇప్పటికే చంద్రబాబు మెగా డీఎస్సీపైనే తొలి సంతకం అని అన్నారు. టీడీపీ కూటమిదే గెలుపు. నిరుద్యోగులను చులకనగా చూసిన జగన్‌ను రాజకీయ నిరుద్యోగి మారుస్తాం. ఓటేసే రోజు వస్తుందిగా... ఆ రోజు చెబుతాం.




చంద్రబాబు కొట్టాలలో దగ్గుబాటి ప్రసాద్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, ప్రచారంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

దళితుల ద్రోహి.. జగన్: దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 19: దళితుల ద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కూటమి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అన్ని విధాలుగా ఆదుకున్నా రన్నారు. ఆయా వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దళితులపై హత్యాచారాలు, దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. శిరోముండనం కేసులో వైసీపీ నాయకుడు తోట త్రిమూర్తులకు కోర్టు శిక్ష విధించిందని, అలాంటి వ్యక్తిని వైసీపీ నాయకులు కాపాడటం సిగ్గు చేటని అన్నారు. వైసీపీ పాలనలో దళితులకు రక్షణ కరువైందన్నారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో 6,035 మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే చంద్రబాబు తిరిగి సీఎం కావాలన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ఆయన అన్ని వర్గాల ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు లక్ష్మీనరసింహ, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగార్జున, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కదిరప్ప, శ్రీనివాసులు, శివకుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి అనంతకు లేదు

అనంతపురం రూరల్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును విమర్శించే స్థాయి అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి లేదని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. చంద్రబాబునాయుడపై అనంత వెంకట్రామిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన తీవ్రంగా స్పందించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబును కుప్పంలో ఓడించడం కాదని... ముందు పులివెందులలో మీ పొద్దు మునిగింది చూసుకోవాలని చురకలంటించారు. చంద్రబాబు మూడుసార్లు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా పనిచేశారని, ఆయన రాష్ట్రానికి ఎంత సేవ చేశారన్నది చూసుకోవాలన్నారు. అనంతపురంలో మీరు నాలుగు సార్లు ఎంపీగాను, ఒక సారి ఎమ్మెల్యేగా, మీ తండ్రి రెండు ఎంపీగా పని చేసినా... జిల్లాకు చేసిందేంటని ప్రశ్నించారు. కూటమి కలయికతో అనంతలో వణుకు మొదలైందని, అందుకే స్థాయి మరచి చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోసారి చంద్రబాబు గురించి ఇష్టమెచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేలేదని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న దగ్గుబాటి ప్రసాద్

చంద్రబాబు కొట్టాలలో ప్రచారం

మండలంలోని రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు కొట్టాల్లో దగ్గుబాటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దగ్గుబాటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సైకో పాలన సాగుతోందని, ఆ పాలనను సాగనంపేందుకు మే 13 కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే అనంత కేవలం ప్రకటనలు, గొప్పలు చెప్పుకోవడంతోనే సరిపెట్టారని, సమస్యలు ఏ మాత్రం పరిష్కరించలేదని వాపోయారు. తాము అధికారంలోకి రాగానే... తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, డ్రైనేజీ కాలువలు, రోడ్డులు అన్ని వేయిస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, మాజీ మేయర్ స్వరూపా, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, జనసేన రాష్ట్ర నాయకురాలు పెండ్యాల శ్రీలత, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు జయరామిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

పార్టీ మారిన వారిని చెత్తతో పోలుస్తావా..!

● ప్రకాష్‌రెడ్డీ... కురుబలు, బోయలు, ఎస్సీ, ఎస్టీలంటే అంత చులకనా?
● వారి ఓట్లతో గెలిచిన నిన్ను.. వారే త్వరలో ఇంటికి పంపుతారు
● ఎన్నికల ప్రచారంలో పరిటాల సునీత, శ్రీరామ్

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 19: 'కురుబలు, బోయలు, ఎస్సీ, ఎస్టీల ఓట్లుతో గెలిచి అధికారంలోకి వచ్చిన ప్రకాష్‌రెడ్డి.. ఆయన విధానాలు నచ్చక పార్టీ మారితే వారిని చెత్తతో పోలుస్తావా... ప్రకాష్‌రెడ్డి నిన్ను ఇంటికి పంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి..' అని మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. శుక్రవారం కనగానపల్లి మండలంలోని కోనాపురం, బాలేపాళ్యం, తల్లిమడుగుల గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారికి ఆయా గ్రామస్థులు భారీ గజమాలలతో.. హారతులు పట్టి స్వాగతం పలికి అభిమానాన్ని చాటుకున్నారు. వారు మాట్లాడుతూ.. ప్రకాష్‌రెడ్డి.. ఎన్నికల ముందు అబద్దాలు చెప్పి బీసీ, బడుగు బలహీన వర్గాలను నమ్మించి ఓట్లు వేయించుకుని గెలిచిన అనంతరం వారిని అన్నివిధలా మోసం చేశారన్నారు. ఆ అహంకారాన్ని దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆ అరాచకాలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత టీడీపీ హాయంలో కోనాపురం చెరువుకు హంద్రీనీవా కాలువ నుంచి నీరు ఇచ్చామన్నారు. అయితే ఇప్పుడు కనగానపల్లి చెరువుకు కూడా నీళ్లురావడానికి బాలేపాళ్యం దగ్గర సప్లైఛానల్‌ను పూడ్చివేసినా ఘనత ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు నీరు తెచ్చి రాప్తాడు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, మాజీ జడ్పీటీసీ బిల్లే ఈశ్వరయ్య, సర్పంచ్ రామాంజి, అంకే రామకృష్ణ, ముకుందనాయుడు, మనోహర్‌నాయుడు, బట్టా సురేష్‌చౌదరి, ముత్యాలు, ముకుంద, సంజీవు, రామస్వామి, ఎస్సీసెల్ విజయ్, రాములమ్మ, బిల్లేరాము పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు: పరిటాల సునీత, శ్రీరామ్ ఏ గ్రామానికి వెళ్లినా అక్కడ పెద్దఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానిస్తున్నారు.

నేడు పలు గ్రామాల్లో ప్రచారం

రాప్తాడు.. మండలంలోని గాండ్లపర్తి గ్రామం నుంచి వరిమడుగు, బండమీదపల్లి మీదుగా మరూరు వరకూ శనివారం మాజీ మంత్రి పరిటాల సునీత ప్రచారం నిర్వహిస్తారని మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గాండ్లపర్తి గ్రామం నుంచి రోడ్ షో ప్రారంభమవుతుందన్నారు.



తల్లిమడుగులలో గజమాలతో సునీత, శ్రీరామ్‌కు అభిమానుల స్వాగతం

ప్రకాష్.. ఓటమికి సిద్ధంగా ఉండు: టీడీపీ

రామగిరి, ఏప్రిల్ 19: ఒక ఊరిలో చెత్తనంత ఊడ్చుకొని పరిటాల సునీత ఎత్తుకెళ్లిందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి విమర్శించడంపై టీడీపీ మండల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రామగిరి టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... మీ వైపు ఉన్నప్పుడు బీసీలంతా బంగారం... మీరే పార్టీకి అండ అంటూ ప్రేమ ఒలకబోసి ఇప్పుడు బీసీలను చెత్తతో పోల్చుతావా... వారి బలం ఏమిటో మీకు ఎన్నికల్లో చూపిస్తామని సవాల్ విసిరారు. చెత్త నుంచి సంపదను సృష్టించే శక్తి టీడీపీకి ఉందని, బీసీలను వజ్రాయుధంగా తయారు చేసి వైసీపీ పతనానికి నాందిపలుకుతామన్నారు. రామగిరి మండలంలో టీడీపీకి ఒక్క ఓటు మెజారిటీ వచ్చినా రాజకీయాల నుంచి వైదొలుగు తానంటూ పగల్బాలు పలికిన ప్రకాశ్‌రెడ్డి... జూన్ 4వ సిద్ధంగా ఉండాలని వారు సూచించారు. రామ గిరి, కనగానపల్లి మండలాలు అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంలో జరిగిందో.. వైసీపీ ప్రభుత్వంలో జరిగిందో.. చర్చకు సిద్ధమా అని సవాల్ విసి రారు. నువ్వు ఎన్నిసార్లు అబద్దాలు చెప్పినా నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితులలో లేర న్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు పరందా మయాదవ్, రామ్మూర్తి నాయుడు, మారుతిప్రసాద్, నాగేశ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

19న స్వర నీరాజనాన్ని జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19 : అనంత సినీ సంగీత సాంస్కృతిక సమ్మిళిత కళాసంస్థ ఆధ్వర్యంలో మే 19న స్థానిక లలితకళా పరిషత్‌లో నిర్వహిస్తున్న 'ఘంటసాల 101 పాటల స్వర నీరాజనం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంస్థ అధ్యక్షుడు జీవీ రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. దాదాపు 8 కళా సంఘాలకు చెందిన 50 మంది గాయనీ గాయకులు, సినీ సంగీత గాయకులతో కలిసి 12 గంటలపాటు ఘంటసాల పాటలతో స్వరనీరాజనం చేస్తారన్నారు. కార్యక్రమానికి అనంతపురం జిల్లాతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఘంటసాల అభిమానులు కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాకారులు, కళాభిమానులు విరివిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాతపాటల ప్రేమికుల సంఘం ఓబులదాస్, అనంత ఘంటసాల ఆరాధన సమితి పాలసముద్రం నాగరాజు, పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి సురేష్‌బాబు, అనంత ఉపాధ్యాయ కళాసమితి బాలమురళీకృష్ణ, అనంతనాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ కరణం నాగేంద్రప్రసాద్, మహతి లలిత సంగీత 'పాట'శాల మహిధర్, అనంత సినీ సంగీత కల్చరల్ కమిటీ సుధాకర్‌బాబు, సంస్కార భారతి లక్ష్మి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

శింగనమల, ఏప్రిల్ 19: మండలంలోని సలకంచెరువులో ముందస్తు అడ్మిషన్ చేసుకొంటున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం ఆ కళాశాల యాజమాన్యంను ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. ఆ కళాశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీ గెలిస్తేనే రాష్ట్రాభివృద్ధి

కల్లూరు ప్రచారంలో నాయకులు

గార్లదిన్నె, ఏప్రిల్ 19: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లూరు గ్రామంలో ఆయన బండారు శ్రావణి శ్రీ సోదరి బండారు కిన్నెర శ్రీ, స్థానిక నాయకులతో కలసి బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్డేవన్నూర్, బొగ్గుల వెంకటే సు, బాబయ్య, వడ్లరాము, అంజినేయులు, రామకృ ష్ణ, నాగేంద్ర, రామాంజనేయ ఆచారి, నలపరెడ్డి పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న బండారు కిన్నెర శ్రీ

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: అనంతపురంరూరల్ మండలంలోని తాటిచెర్ల, నరసనాయునికుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. అలాగే ఆత్మకూరు మండలంలోని పీ యాలేరు, పంపనూరు గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలకు చెందిన వారు టీడీపీలో చేరారు. వీరంతా శుక్రవారం జిల్లా కేంద్రంలోని అరవిందనగర్‌లోని మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

రాప్తాడు, ఏప్రిల్ 19: మండలంలోని యర్రగుంటలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, గంగలకుంట రమణ, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజారాం పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

దళితులకు అన్యాయం చేసిన వైసీపీ

గార్లదిన్నె, ఏప్రిల్ 19: సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించి దళితుల నోట్లో మట్టి కొట్టిందని వైసీపీ ప్రభుత్వ తీరుపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నేను ఉన్నాను. నేను విన్నాను అని మాయ మాటలు చెప్పి మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు సుమారు 59,672 కోట్ల నిధులను దారి మళ్లించి ఎస్సీ, ఎస్టీ పిల్లల బంగారు భవిష్యత్‌ను నాశనం చేశారన్నారు. అదేవిధంగా దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసి దళితుల నోట్లో మట్టికొట్టారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ ఉన్నత విద్య పథకానికి జగనన్న విదేశీ ఉన్నత విద్యా పథకమని పేరు మార్చారని ధ్వజమెత్తారు. దళితులకు అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని అంతం చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీసీఆర్ దాస్‌తో పాటు గుర్రం శీనా, మల్లికార్జున, దేవా, నల్లప్ప, పెద్దన్న, ఓలేసు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

గార్లదిన్నె : ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 21న ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశానికి 305 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికి ఈ పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి 12 వరకు నిర్వహిస్తామని అన్నారు. పరీక్ష ఏవిధంగా రాయాలి... ఓఎంఆర్ షీట్‌ను నింపడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. తదితర విషయాలపై విద్యార్థులకు శనివారం ఉదయం పది గంటలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

శింగనమల ఏప్రిల్ 19: మండలంలోని గురుగుంట్లలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన నుంచి 26 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టాలి

కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు విలాస్ షిండే

అనంతపురం టౌన్ : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకే ఖర్చులు పెట్టాల్సి ఉంటుందని, దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా అధికారులకు కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో షిండే మాట్లాడుతూ... ఎక్కడ కమిషన్ ఉత్తర్వులను ఉల్లంగించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఖర్చుల వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరు వినోద్‌కుమార్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, నగరపాలక కమిషనర్ మేగస్వరూప్, అధికారులు పాల్గొన్నారు.



ఖర్చులను సమీక్షిస్తున్న పరిశీలకులు

అసిస్టెంట్ కలెక్టరుగా తెలుగమ్మాయి

బాధ్యతలు స్వీకరించిన బొల్లిపల్లి వినూత్న

అనంతపురం టౌన్, ఏప్రిల్ 19: జిల్లాకు నూతన అసిస్టెంట్ కలెక్టరుగా తెలుగమ్మాయి బొల్లిపల్లి వినూత్నను ప్రభుత్వం నియమించింది. శుక్రవారం ఆమె ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. తొలుత మర్యాదపూర్వకంగా కలెక్టరు వినోద్‌కుమార్‌ను కలిశారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్‌గా కలెక్టరేట్‌లోని తమ చాంబరులో బాధ్యతలు తీసుకున్నారు. ఆమెకు పలువురు అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె 1995లో గుంటూరు జిల్లా అమరావతిలో జన్మించారు. ఆమె తల్లి సుభాషిణి అగ్రికల్చర్ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా, తండ్రి రవి క్యాటిల్ బ్రీడింగ్ ఫామ్ శాఖలో ప్రస్తుతం ప్రకాశం జిల్లా చదలవాడలో డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్నారు. ఆమె పదో తరగతి వరకు ఒంగోలులో, ఇంటర్ విజయవాడ శ్రీచైతన్యలో చదివారు. బెంగుళూరులోని అమృత ఇంజినీరింగ్ కాలేజ్‌లో బీటెక్ మెకానికల్ ఇంజినీ రింగ్ చేశారు. 2023 సివిల్ సర్వీసెస్ ఐఏఎస్ బ్యాచ్‌లో ఎంపికయ్యారు. గతేడాది జరిగిన ఐఏఎస్ బ్యాచ్ పరీక్షల్లో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం తొలిసారిగా అనంత అసిస్టెంట్ కలెక్టరుగా నియమితులయ్యారు.



మూడుదారులూ మూసివేత

కార్యాలయాలకు వెళ్లలేక ఉద్యోగుల పాట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో ప్రజలు, ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. ఆర్డీఓ కార్యాలయం గతంలో టవర్‌క్లాక్ వద్ద ఉండేది. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి వేయడం, నిర్మాణాల కోసం ఆర్డీఓ కార్యాలయాన్ని డ్వామా కార్యాలయం ఆవరణంలోకి మార్చారు. ఈ క్రమంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో నామినేషన్ల ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నామినేషన్ల స్వీకరణతో ఆర్డీఓ కార్యాలయంలోకి వెళ్లే మూడు దారులనూ పోలీసులు మూసి వేశారు. దీంతో డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్, అటవీ, విజిలెన్స్, పర్యాటక శాఖ, భూమి నాణ్యత శాఖల ఉద్యోగులు అటు వెళ్లడానికి నానా ఇబ్బందుతులు పడుతున్నారు. ఐడీ కార్డు ఉంటేనే కార్యాలయాలలోకి అనుమతిస్తున్నారు. ఒకవేళ ఉద్యోగులు ఐడీ కార్డు ఇంట్లోనే మరిచిపోతే ఇక అంతే సంగతులే. ససేమిరా పోలీసులు కార్యాలయాల్లోకి ఉద్యోగులను అనుమతించడం లేదు. ఇందుకు వేరే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటు తీసుకురావాలని ఆయా కార్యాలయాల ఉద్యోగులు, పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు కోరుతున్నారు.



ఉపాధ్యాయభవన్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు

హంసవాహనంపై రామచంద్రుడు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19 : శ్రీరామనవమి బ్రహ్మోత్స వాల్లో భాగంగా మూడో రోజున శుక్రవారం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో రామచంద్రుడు హంస వాహనంపై ఊరేగారు. ఉదయం సీతారాములకు వివిధ అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంక రించిన రథంలో హంసవాహనంపై స్వామివార్లను ఉంచి.. పురవీధుల్లో ఊరేగించారు. నగరోత్సవానికి ముందు భక్తులు రామకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ ముందుకు సాగారు. రాత్రికి స్వామివార్లకు దశహారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్ బాబు, అనువం శీకుడు హోసూరు రామసు బ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్ బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్ర హ్మణ్యం, ప్రధానార్చకుడు నరసిం హశాస్త్రి పాల్గొన్నారు.





ఆస్పత్రి అధికారులతో హౌస్‌సర్జన్ల కమిటీ నూతన సభ్యులు

ఆస్పత్రి హౌస్‌సర్జన్ల కమిటీ నియామకం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 19: జిల్లా బోధనాసుపత్రిలో పనిచేస్తున్న హౌస్ సర్జన్ల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సమరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పునీత్‌రెడ్డి, త్రివేణి, సెక్రెటరీగా మౌనిక, ట్రెజరర్ వర్ష, జాయింట్ సెక్రెటరీగా చేతన్ నవ్య, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా కళ్యాణ్, వికాష్, దేవసాయి, సంజుసత్యన్, ఆమీనా, సాయిసింధులను ఎన్నుకున్నారు. ఈ సభ్యులు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు పద్మజ, హేమలతను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

అగ్నిప్రమాదాల్లో అప్రమత్తతపై అవగాహన

అనంతపురం టౌన్, ఏప్రిల్ 19: ఎండాకాలం నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలనే దానిపై జిల్లా ఆస్పత్రిలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ఆస్పత్రి ఆవరణంలో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి ప్రాక్టికల్‌గా చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు హేమలత, పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్ రజని, ఐసీయన్స్ శోభ, రేష్మా, ప్రసన్న, అగ్నిమాపకశాఖ అదికారి లింగమయ్య పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

జేఎన్‌టీయూలో కళాశాల ఆవిర్భావ వేడుకలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 19: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ అధ్యక్షతన ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ వేడుకలకు రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో 1946న ఏర్పాటు చేసిన కళాశాల.. సాంకేతిక విద్యావనంలా విస్తరిస్తోందన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న ఎడ్ఎక్స్ సర్టిఫికెట్ కోర్సుకు విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ వేడుకల సందర్భంగా స్పోర్ట్స్ సెక్రెటరీ జోజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులను అందజేశారు.

పేద విద్యార్థులకు చేయూత..: ప్రొఫెసర్ దామోదర్, సరస్వతమ్మ దంపతులు రూ.25 లక్షల నగదును కళాశాల ఖాతాలో డిపాజిట్ చేసి ఆ మొత్తానికి ఏడాదిలో వచ్చే వడ్డీని పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లా అందిస్తున్నారు. అలాగే కళాశాలలో పూర్వ విద్యార్థులు కూడా ఆర్థిక సాయం అందజేశారు. దీంతో 40 మందికిపైగా విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ నగదును ఈ సందర్భంగా అందజేశారు.

పశుగ్రాసానికి నిప్పు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 19: పశుగ్రాసానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిన సంఘటన చెన్నేకొత్తపల్లిలో గురువారం రాత్రి జరిగింది. ఆ గ్రామానికి చెందిన కురుబపెద్ద నరసింహ, కావిటి సూదెప్ప గ్రామసమీపంలో బీడు భూముల్లో వేరువేరుగా వేరుశనగ కట్టెని వాము వేసుకున్నారు. వేసవి కావడంతో గొర్రెల మేత కోసం ఆ ప్రాంతంలో పశుగ్రాసాన్ని నిల్వ ఉంచుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో ఏడు ట్రాక్టర్ల వేరుశనగ కట్టె కాలిపోయిందని, రూ.1.50 లక్ష వరకు నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. ఎవరో ఉద్దేశంతోనే పశుగ్రాసానికి నిప్పు పెట్టి ఉంటారని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడికి వెళ్లి పరిశీలించారు. బాధితులు పోలీసులకు పిర్యాదు చేశారు. బాధితులను టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి శుక్రవారం సీకేపల్లికి చేరుకుని పరామర్శించారు. ఆయన వెంట కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, అంకే అమరేంద్ర, యజ్ఞేశంకర్, మాడెం సూర్యనారాయణరెడ్డి, అమరేంద్రరెడ్డి, రామాంజి, కోళ్లసూరి, శివ, వెంకటరాముడు, శివారెడ్డి, బన్యాలసూరి, చెన్నకేశవుల గౌడ్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

చీనీకాయలు టన్ను రూ.36 వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36 వేలు, కనిష్ఠంగా రూ.17 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 934 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఎస్కేయూలో 'ప్రేరణ ఉత్సవ్'

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 19: ఎస్కేయూ క్యాంపస్ కేంద్రీయ విద్యాలయంలో ప్రేరణ ఉత్సవ్-2024ను శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కరీమ్‌ఖాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పద్య, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాల, బాలికలను 15 మంది చొప్పున ఎంపిచేశారు. వీరందరికీ మౌఖిక పరీక్షలు నిర్వహించి ఒక బాల, బాలికను ఎంపిక చేసి గుజరాత్ వాడ్‌నగర్ పోటీలకు పంపుతామని ప్రిన్సిపాల్ కరీమ్‌ఖాన్ తెలిపారు.

వార్డుల్లో పట్టు సాధిస్తేనే గెలుపు

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జయరాం



మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 19: మునిసిపాలిటీలో అన్ని వార్డుల్లో పట్టు సాధించి, ఆధిక్యత చేజిక్కించుకున్నప్పుడే గెలుపు సునాయాసమౌతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం ఉదయం కసాపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో వార్డు ఇన్చార్జిలు, బూత్-యూనిట్-క్లస్టర్ ఇన్చార్జుల సమావేశాన్ని నిర్వహించారు. పలువురు పార్టీ నాయకుల అభిప్రాయాలను జయరాం తీసుకున్నారు. వార్డు ఇన్చార్జులతో కలసి సమష్టిగా ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించినప్పుడే ప్రతి వార్డులో ఆధిక్యం సాధించగలమని అన్నారు. సమన్వయంతో పనిచేసి అనుకున్నది సాధిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆర్ పవన్ కుమార్ గౌడు, గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు నారాయణ, బండారు ఆనంద్, కేసీ హరి, అమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి సరోజమ్మ, తలారి మస్తానప్ప, కృపాకర్, గుడిపాటి అంజనేయులు, కొడెల చంద్రశేఖర్, టీ కేశప్ప, పాల్గొన్నారు.

వెంకటరామి రెడ్డి ఓటమి తథ్యం: చేసిన అవినీతి పనుల కారణంగా రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి వై వెంకటరామి రెడ్డి ఓడిపోవడం ఖాయమని గుమ్మనూరు జయరాం శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో అన్నారు. వెంకట రామిరెడ్డి అవినీతి కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని కూడా తాకిందని, ఒక హోంగార్డు ట్రాన్స్‌ఫర్ కావాలన్నా ఎమ్మెల్యే అల్లుడితో భేటీ కావాల్సిందేనని ఆరోపించారు. పార్టీలో బీసీలు ఎదిగితే రాబోయే రోజుల్లో తన కుమార్తె రాజకీయ జీవితానికి అడ్డు ఏర్పడుతుందన్న కారణంతో వెనుకబడిన తరగతుల వారిని అణగక్కారని విమర్శించారు. ఎన్నికల్లో బీసీ నాయకులు ఈ విషయాన్ని గుర్తుంచుకుంటారని అన్నారు. కూతురు, అల్లుడి అక్రమాల కారణంగా ఎన్నికల్లో వెంకట రామిరెడ్డి ఓటమి తథ్యమన్న అభిప్రాయం ప్రజల్లో స్థిరపడిపోయిందన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణకు గెలిపించాలని ముష్టూరు తిమ్మప్ప పిలుపునిచ్చారు. మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఆయన ప్రచారం నిర్వహించారు. కొండా నాగరాజు, శివయ్య సుంకన్న, సురేష్, రాజు, యుగంధర్, బాస్కర్, సాంబశివుడు పాల్గొన్నారు.

టీడీపీలోకి 30 కుటుంబాలు



టీడీపీలో చేరినవారితో గుమ్మనూరు ఈశ్వర్

పామిడి: మండలంలోని కట్టకిందపల్లిలో 30 కుటుంబాలు మాజీ మంత్రి, గుంతకల్లు నియోజకవర్గ అభ్యర్థి గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా సుంకులమ్మదేవి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు



ఉత్సవమూర్తుల ఊరేగింపు

విడపనకల్లు ఏప్రిల్ 19: మండల కేంద్రంలో వెలసిన సుంకులమ్మదేవి, దేవమ్మదేవి, నూతన రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులతో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ఆడపడుచులను పిలిపించి వడి బియ్యం పోయించి అమ్మవార్లకి పూజలు చేశారు. మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక సుంకులమ్మ ఆలయం నుంచి రంగస్వామి ఆలయం వరకూ రథాన్ని లాగారు.

చెన్నకేశవస్వామి రథోత్సవం: మండలంలోని కరకముక్కల గ్రామంలో శుక్రవారం చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కొండపై వెలసిన కొండ తిమ్మప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు చేసి సాయంత్రం రథాన్ని లాగారు.

సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకరణలో పార్వతీపరమేశ్వరులు

కూడేరు, ఏప్రిల్ 19: మండల కేంద్రంలో వెలసిన జోడిలింగాల సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులు వ్యాగ్ర వాహనంపై విహరించారు. వాహనాన్ని వివిధ రకాల పుష్పాలతో పాటు విద్యుత్ దీపాలట ఆలయాన్ని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

బెళుగుప్ప, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని గౌరసముద్రం మారెమ్మ ఆలయం ముందు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వేదపండితుల మంత్రోచ్చారణలతో భక్తులు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అశ్మిత్‌రెడ్డి నామినేషన్‌కు తరలిన శ్రేణులు

యాడికి, ఏప్రిల్ 19: కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం మండలవ్యాప్తంగా నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు,క్లాస్- కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ గంగాధర్ ఆధ్వర్యంలో నాయకులు తాడిపత్రికి తరలివెళ్లారు. రాయలచెరువులో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్‌ల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు.

కళ్యాణదుర్గానికి మహర్దశ రానుంది

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని



ఓటరుకు నమస్కరిస్తున్న అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 19 : అస్తవ్యస్తంగా మారిన కళ్యాణదుర్గం నియోజకవర్గానికి మహర్దశ రానుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ 15వ వార్డు బోయవీధి, 16వ వార్డు చౌడమ్మగుడి వీధి, 17వ వార్డు బావి బసవేశ్వరస్వామి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అమిలినేనికి ఆయ కాలనీవాసులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్‌షో, ర్యాలీలో పాల్గొన్నారు. అమిలినేని మాట్లాడుతూ పట్టణ ప్రజల నుంచి పన్నులు కట్టించుకుంటున్నారే తప్ప వారికి అవసరమైన డ్రైనేజీలను ఏర్పాటు చేయకపోవడం, ఉన్న వాటిని శుభ్రం చేయకపోవడం దారుణమన్నారు. మురుగునీటితో దుర్వాసన వెదజల్లుతున్నా మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం స్పందించలేదన్నారు. మున్సిపాలిటీకి ప్రజలు కట్టిన పన్నులు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ప్రజలు కట్టిన పన్నులు మున్సిపాలిటీకి కాకుండా తాడేపల్లిప్యాలెస్‌కు వెళ్లాయనే అనుమానాలు వస్తున్నాయన్నారు. మరో రెండు నెలల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకుని మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు వేసి డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేసుకుని పట్టణ ప్రజలు కట్టిన పన్నులకు న్యాయం చేస్తామన్నారు. అలాగే కళ్యాణదుర్గంను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకుంటామన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో టీడీపీని ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అశేష జనవాహిని

బ్రహ్మసముద్రం మండలంలో వైసీపీకి షాక్

బ్రహ్మసముద్రం మండలం ఎరడికెర గ్రామ ఎంపీటీసీ మారుతమ్మ, ఆమె భర్త అంజి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. అమిలినేని సురేంద్రబాబు టీడీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే పాలవెంకటాపురం పంచాయతీ ఎర్ర కొండాపురం గ్రామ వైసీపీకి చెందిన ఎనిమిది కుటుంబాలు టీడీపీలోకి చేరాయి.

అట్టహాసంగా జేసీ అశ్మిత్‌రెడ్డి నామినేషన్



అశ్మిత్ రెడ్డిని ఆశీర్వదిస్తున్న తల్లి జేసీ ఉమా రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 19: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు తరలి రావడంతో పట్టణంలోని సీబీరోడ్డు పసుపుమయంగా మారింది. స్థానిక నివాసంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించిన అశ్మిత్‌రెడ్డి అనంతరం తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. ముందుగా మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం జేసీ పవన్‌రెడ్డిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. నివాసం నుంచి నాయకులు, కార్యకర్తలతో పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బుగ్గరామలింగేశ్వరునికి అశ్మిత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటి నుంచి బయలుదేరిన అశ్మిత్‌రెడ్డి, పవన్ రెడ్డి సంజీవనగర్ మొదటిరోడ్డు, పుట్లూరురోడ్డు మీదుగా గాంధీసర్కిల్‌కు చేరుకున్నారు. అంతకుమునుపే అక్కడికి చేరుకున్న వేలాదిమంది కార్యకర్తలు ఆయనకు బాణాసంచా పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మరో వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ వద్దకు చేరుకున్నారు. అనంతరం నామినేషన్ దాఖలు చేయడానికి ర్యాలీగా బయలుదేరారు. తాడిపత్రి అసెంబ్లీ స్థానానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా శుక్రవారం జేసీ అశ్మిత్ రెడ్డి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డికి అందించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని భాస్కర్‌రెడ్డి బలపరిచారు. అశ్మిత్ రెడ్డి నామినేషన్ దాఖలు చేస్తుండడంతో డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. నిబంధనల ప్రకారం ర్యాలీగా వచ్చిన అశ్మిత్‌రెడ్డితోపాటు కదిరి శ్రీకాంత్‌రెడ్డి, రంగనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలను కార్యాలయంలోకి అనుమతించారు.

ర్యాలీలో కొద్దిసేపు ఉద్రిక్తత

గాంధీసర్కిల్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన జేసీ ప్రభాకర్‌రెడ్డి నిబంధనలమేరకు ఏర్పాటుచేసిన బారికేడ్లను దాటి రావడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయానికి వందమీటర్ల దూరంలో ఏర్పాటుచేసిన బారికేడ్లు, పోలీసు అధికారులు ఉన్నప్పటికీ దాటుకొని కార్యాలయంవైపు వెళ్లడానికి ప్రయత్నించడంతో వేలాదిగా ఉన్న కార్యకర్తలు ఉన్నట్లుండి ఆయనతోపాటు వెళ్లడానికి ప్రయత్నించారు. వెంటనే పోలీసు అధికారులు కల్పించుకొని ప్రభాకర్‌రెడ్డిని అక్కడి నుంచి బయటకు వెళ్లాలని సూచించడంతో ఆయన బయటకు రావడం కనిపించింది.



ర్యాలీగా వస్తున్న టీడీపీ శ్రేణులు



జేసీపీఆర్ బారికేడ్లు దాటిరావడంతో చొచ్చుకువచ్చిన కార్యకర్తలు

టీడీపీతోనే బడుగువర్గాలకు సమన్యాయం

● ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



ఓటు అభ్యర్థిస్తున్న శ్రావణి

పుట్లూరు, ఏప్రిల్19: టీడీపీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండలంలోని గొల్లపల్లి, సూరేపల్లి, చింతకుంట తదితర గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలపై అనేక దాడులు జరిగాయన్నారు. అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. అన్నివర్గాలకు న్యాయం జరగాలంటే సైకిల్ గుర్తుకు ఓటువేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని తెలిపారు. మండల కన్వీనర్ బాలరంగయ్య, చవ్వా కులశేఖర్‌రెడ్డి, జీసీ బాబు, పుల్లారెడ్డి, జయుడు, రాజేషనాయుడు, రామాంజనేయులు, రామానాయుడు, వేణు, శ్రీనివాసులు నాయుడు, నాగేశ్వర్‌రెడ్డి, రంగయ్య, రవికుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శీనా, గిరిరెడ్డి, రామాంజి పాల్గొన్నారు.



టీడీపీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక: మండలంలోని కందికాపుల, చింతకుంట గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. టీడీపీ కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో సర్పంచు శివరామయ్య, గోపాల్‌రెడ్డి, సరస్వతమ్మ, సుధాకర్‌రెడ్డి, భైరవేశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, నాగరాజు, భగవత్ ప్రసాద్‌రెడ్డితోపాటు మరో 20కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలరంగయ్య, కులశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

కుందుర్పి, ఏప్రిల్ 19: మండలంలోని బెస్తరపల్లిలో పనిచేస్తున్న 14 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను వరు సెక్రటరీకి అందజేశారు.

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఎనిమిది మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. వారి రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శికి అందజేయడంతో వాటిని ఆమోదించి రికార్డులు, సెల్‌ఫోన్లు, సిమ్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

యల్లనూరు: మండలంలో శుక్రవారం 18 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు విజయశేఖర్‌నాయుడు తెలిపారు. చిలమకూరులో ఒకరు, యల్లనూరులో 10మంది, వెన్నపూసపల్లిలో ఏడుగురు తమ రాజీనామా లేఖలను ఆయా సచివాలయాల్లో అందజేసినట్లు ఆయన తెలిపారు.

25 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలోకి చేరిన వారితో జేసీ దివాకర్ రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 19: స్థానిక నివాసంలో పెద్దవడుగూరు మండలం చిత్రచేడు, గోపరాజుపల్లి గ్రామాల్లోని వైసీపీకి చెందిన 25 కుటుంబాలు మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. సీనియర్ నాయకులు వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి దివాకర్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో లచ్చప్ప, చితంబరి, రామకృష్ణ, నాగప్ప తదితరులు ఉన్నారు. శరభారెడ్డి, రాము పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు కదిలిన తెలుగు తమ్ముళ్లు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 19: కణేకల్లులో చంద్రబాబు సభకు శుక్రవారం మండల కన్వీనర్ కురుబ హనుమంతు ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. టీడీపీ నాయకులు కాటా వెంకటేశులు, సోమశేఖర్, వీరేష్, సిద్ధప్ప, జోగప్ప, గిరిధర్‌నాయుడు, లచ్చన్నచౌదరి, డాక్టర్ రామస్వామి, ప్రసాద్, గోవిందరాజులు, తిప్పేస్వామి వెళ్లినవారిలో ఉన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కణేకల్లులో జరిగే చంద్రబాబు ప్రజాగళం సభకు టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న ఆధ్వర్యంలో 50 మంది బస్సులో వెళ్లారు.

బొమ్మనహాళ్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కణేకల్లులో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం బహిరంగసభకు టీడీపీ శ్రేణులు కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, కుమ్మరి మల్లికార్జున, వాణి జగన్నాథ్‌రెడ్డి, ఎర్రగుంట్ల వెంకటేశులు, అప్పారావు, కొత్తపల్లి తిమ్మరాజు, ముల్లంగి నారాయణస్వామి, మహేంద్ర, ఉప్పర హాళ్ స్వామి, పయ్యావుల అనిల్, పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు, కేశప్ప, గ్యాస్ గోవిందు పాల్గొన్నారు.





గుమ్మఘట్ట, ఉడేగోళం నుంచి ప్రజాగళానికి వెళ్తున్న టీడీపీ శ్రేణులు

మీ కూలీగా పనిచేస్తా... ఓటుతో ఆశీర్వదించండి

● రోడ్ షోలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



తగ్గుపర్తి గ్రామంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, ఏప్రిల్ 19: మీ కూలీగా పని చేస్తా... ఓటుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అభ్యర్థించారు. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలసి శుక్రవారం రోడ్డుషో నిర్వహించారు. గ్రామగ్రామాన ఆయనకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి గజమాలతో స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధికి పెద్ద పీట వేశామన్నారు. మండలంలో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు రెండు చెరువులను కృష్ణాజలాలతో నింపామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల మంజూరు చేయించానన్నారు. జగన్ ఓ పందు లాంటి వ్యక్తి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. ఇంటికి త్వరలో సాగనంపుదామని పిలుపునిచ్చారు. రిజర్వాయరు ఊట నీటి ముప్పు పరిష్కరించడానికి ఆర్అండ్ఆర్ కింద మంజూరు చేయించిన ఘనత తమదేనన్నారు. అసమర్థ విశ్వేశ్వరరెడ్డి మూడు నెలల్లో సమస్య తీరుస్తానని చేతులెత్తేశాడని విమర్శించారు. టీడీపీని గెలిపించడం, మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఒక్క అభివృద్ధి పనైనా చేశావా అని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ కూటమిలో ఉన్నారని, ఇక నుంచి వైసీపీ ఆటలు సాగవన్నారు. మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, జనసేన ఇన్‌చార్జి గౌతం, కన్వీనర్ ప్రసాద్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ యూత్ నాయకులు

మండలంలోని జీడిపల్లి గ్రామ వైసీపీ యూత్ నాయకులు కే మధు, కే శివ శుక్రవారం పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పయ్యావుల కేశవ్‌ను ఆశీర్వదించండి



ప్రచారం నిర్వహిస్తున్న పయ్యావుల విక్రమ్‌సింహా

విడపనకల్లు: ఉరవకొండ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను ఆశీర్వదించాలని ఆయన కుమారుడు పయ్యావుల విక్రమ్‌సింహా గడేకల్లు ప్రజలను కోరారు. మండలంలోని గడేకల్లు గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. విక్రమసింహా మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యతీరాలన్నా, పేదరికం పోవాలన్నా టీడీపీకి అందరూ అండగా నిలవాలని కోరారు. బీడీ చిన్న మారయ్య, భీమలింప్ప, దేవేంద్ర, శ్రీనివాసులు, శ్రీనావస్ చౌదరి, రాము పాల్గొన్నారు.



44డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన దృశ్యం (వెదర్ రిపోర్టు)

నిప్పుల కొలిమి

యాడికి, ఏప్రిల్ 19: ఎండలు రోజురోజుకు మండిపోతున్నాయి. ఎక్కడ నిల్చున్నా, కూర్చున్నా నిప్పుల కొలిమి వద్ద ఉన్నట్లే ఉంది. యాడికి మండలంలో శుక్రవారం అత్యధికంగా 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో ఉక్కపోత తట్టుకోలేకపోతున్నారు. గురువారం సాయంత్రం మండలం అంతా మేఘావృతమై పెద్దగా గాలులు వీయడంతో వర్షం వస్తుందేమో అనుకున్నారు. ఆ ప్రభావం శుక్రవారం ఉదయం నుంచి ఎండలు భగభగమన్నాయి. ఎండల ప్రభావంతో ఇప్పటికే భూగర్భజలాలు ఇంకిపోయాయని, ఎండలు ఇలాగే కొనసాగితే తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న అన్నదాతలు

పామిడి, ఏప్రిల్ 19: పామిడి పెన్నానది పరివాహక ప్రాంతంలో అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను అన్నదాతలు అడ్డుకున్నారు. తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఆధ్వర్యంలో ఈ ఇసుక రవాణా జరుగుతున్నట్లు తెలిసింది. కొండూరు - పామిడి మధ్య రోడ్డును ఎంతో కష్టపడి వేయించామని రైతులు పేర్కొన్నారు. అయితే వైసీపీ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధిక మోతాదులో ఇసుక లోడుతో టిప్పర్లు ఈ రోడ్డుపై వెళితే రోడ్డు ఛిద్రమవుతుందన్నారు. ఐదు టిప్పర్లలో రెండు టిప్పర్లు తప్పించుకోగా మూడు టిప్పర్లు, హిటాచీని అన్నదాతలు నరేంద్రరెడ్డి, కేశవరెడ్డి, పక్కీరప్ప, ఇటుకనేల పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై పోలీసులను అడుగగా పూర్తి వివరాలు తెలియదని విచారిస్తున్నామన్నారు.

జేసీ కుటుంబంపై ఉన్నన్ని కేసులు ఎవరిమీదా లేవు

● టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ



ర్యాలీలో పాల్గొన్న అంబికా, పవన్ రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్19: రాష్ట్రంలోనే జేసీ కుటుంబ సభ్యులపై పెట్టిన అక్రమ కేసులు ఎవరి మీద ఉండవని టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరైన అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జేసీ కుటుంబంపై కక్ష కట్టిందన్నారు. బస్సులను సీజ్‌చేయడం, అక్ర మ కేసులు పెట్టడం, జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందారన్నారు. కానీ బంతిని ఎంత తన్నితే అంతపైకి వెళుతుందన్న చందంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి అంతకంతకు ప్రజాదరణ పొందుతున్నాడని అన్నారు. ఈ ఎన్నికల్లో తనతోపాటు ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిలకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. జేసీ పవన్‌రెడ్డి మాట్లాడుతూ అశ్మిత్ రెడ్డికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటానన్నారు. ప్రజలకు కష్టం వస్తే అండగా నిలబడతాడని తెలిపారు. చిన్నాన్న జేసీ ప్రభాకర్‌రెడ్డి వయస్సు మళ్లినా ఎప్పుడూ తాడిపత్రి అభివృద్ధి కోసం తపన పడుతుంటాడని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకున్న అశ్మిత్‌రెడ్డి అంతకు రెట్టింపుతో పనిచేస్తాడని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



ర్యాలీలో మాట్లాడుతున్న చీఫ్ నోడల్ ఆఫీసర్ రాజ్‌కుమార్

పామిడి, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ చీఫ్ నోడల్ అధికారి రాజ్ కుమార్ సూచించారు. ఓటు హక్కు సద్వినియోగంపై ఓటర్ల అవగాహన కోసం శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో ఓటు విలువపై ఓటర్లకు అవగాహన కల్పించారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరరావు, ఈఓఆర్‌డీ శశికళ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ షేక్షావలి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలకృష్ణ, ఈఓ చంద్రశేఖర్, మెప్మా సీఈఓ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన దృశ్యమాలిక


అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు


సెల్‌ఫోన్ టార్చ్ వేసి హర్షం వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు


వాహనంపై చంద్రబాబుతో కాలవ శ్రీనివాసులు, అంబికా లక్ష్మీనారాయణ

విద్యపై శ్రద్ధ ఉంచండి


మాట్లాడుతున్న ఈశ్వర్

గుత్తి, ఏప్రిల్ 19: విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాజకీయలు పట్ల శ్రద్ధ వద్దని, విద్యపై ఆసక్తి చూపి రాణించాలని గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ సూచించారు. స్థానిక శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల వార్షికోత్సం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకుని ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. విద్యార్థులను చూస్తుంటే నా కాలేజీ రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు ఈశ్వర్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 19: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ అశ్వర్థ మాట్లాడుతూ అగ్నిప్రమాదాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది ప్రతాప్‌నాయక్, లోకేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలాని లాగుతున్న ఎద్దులు

ఉరవకొండ, ఏప్రిల్ 19: మండలంలోని బూదగవి గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాతిదూలం లాగుడు పోటీలు ఉల్లాసంగా సాగాయి. మొదటి బహుమతి హనుమంతప్ప ఎద్దులు నిలిచాయి. 15 తులాల వెండిని బహుమతిగా అందజేశారు. రెండవ బహుమతి గాదిలింగప్ప ఎద్దులు దక్కించుకున్నాయి. 11 తులాలవెండిని బహుమతిగా ఇచ్చారు. మూడో స్థానంలో నాగరాజుకు చెందిన ఎద్దులు నిలిచాయి. 8 తులాల వెండిని గెలిచాయి. మాజీ సర్పంచ్ చిరంజీవి, విరూపన్న గౌడ్, హనుమంతు, అఖిల్, నాగరాజు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్


వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఎండీయూ ఆపరేటర్ వెంకటేశ్వర్లు (వృత్తంలోని వ్యక్తి)

గుత్తిరూరల్, ఏప్రిల్ 19: పట్టణంలో కొందరు ఎండీయూ ఆపరేటర్లు నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. శుక్రవారం గుత్తి ఆర్ఎస్‌లో గుంతకల్లు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటరామిరెడ్డి తరుపున ప్రచారం నిర్వహించారు. గుత్తిలోని పాత సీపీఐ కాలనీకి చెందిన కోట వెంకటేశ్వర్లు ప్రభుత్వం తరుపున ఎండీయూ అపరేటర్‌గా పని చేస్తున్నాడు. అతను వైసీపీ కండువ వేసుకొని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

కణేకల్లు, ఏప్రిల్ 19: మండల కేంద్రానికి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆ పార్టీ నాయకులు, జనసేన, బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. కణేకల్లు క్రాసింగ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో చంద్రబాబు సాయంత్రం 6.15 ల్యాండ్ కాగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఆలం నరసానాయుడు, పూల నాగరాజు, ముంటిమడుగు కేశవరెడ్డి, ఉండాల హనుమంతరెడ్డి, ఆనంద్, వేలూరు మరియప్ప, తిమ్మరాజు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, లాలెప్ప, ఎస్కే మల్లికార్జున, బీటీ రమేష్ తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 19: కణేకల్లులో తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రజాగళం సభ నిర్వహించడంతో టీడీపీ శ్రేణులలో నూతనోత్తేజం నిండింది. టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున కణేకల్లుకు చేరుకున్నారు. ప్రజాగళం సభ లో బీజేపీ, జనసేన, ఎమ్మార్పీస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి భాగస్వాములయ్యారు. ఆయా పార్టీల జెండాలతో అభిమానులు కేరింతలు, ఈలలు వేస్తూ ఉత్సాహంగా కనిపించారు.

కాంప్లెక్స్ గది సీజ్

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 19: పట్టణంలోని మండల పరిషత్‌కు సంబంధించిన కాంప్లెక్స్ గదిని శుక్రవారం ఎంపీడీఓ అల్లాబకాష్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఇటీవల కాంప్లెక్స్‌కు సంబంధించిన ఏడు గదులను సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఒక గదికి సంబంధించి నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి మూడురోజులు కావడంతో అధికారుల సమక్షంలో గదిని సీజ్ చేశారు. దీంతో ఎనిమిది గదులు సీజ్ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రంగనాయకులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఒకరికి గాయాలు

బెళుగుప్ప, ఏప్రిల్ 19: మండలంలోని గంగవరం గ్రామశివారులో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిమంటల్లో పడి నంద్యాల జిల్లా పొన్నవరం గ్రామానికి చెందిన పెయింటర్ పవన్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు గంగవరం నుంచి కళ్యాణదుర్గానికి బైకుపై వెళుతుండగా వెనుక కూర్చున్న పవన్ తోట వద్ద అప్పటికే మంటలలో పడ్డాడు. శరీరం 50 శాతం కాలిపోయింది. గ్రామస్థులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువుల నుంచి పిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆలయంలో చోరీ

బెళుగుప్ప, ఏప్రిల్ 19: మండలంలోని అంకంపల్లి మారెమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు పూజారి శంకరయ్య పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఉదయం పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లి చూడగా హుండీతో పాటు రెండు గుడిగంటలు కనిపించడం లేదని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పొలంలో పైపులు ధ్వంసం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 19: వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న నాగరాజు అనే రైతు పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు పైపులను ధ్వంసం చేసినసంఘటన కంబదూరు మండలం అండేపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎరికుల నాగరాజుకు సంబంధించిన పొలంలో మోటారుకు బిగించిన పైపులను, పంటలకు నీరు వెళ్లే పైపులను గొడ్డలితో ధ్వంసం చేశారు. రూ.30 వేలు నష్టపోయానని రైతు తెలిపాడు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జరిగిన నష్టంపై విచారించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు పోలీసులను కోరారు.